Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 208 మేడ్చల్ మల్కాజ్‌గిరి 18 ఆగష్టు 2023 శుక్రవారం పేజీలు : 4

## పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలోకి రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : రక్షణ శాఖ సంబంధిత పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి రాహుల్ గాంధీ తాజాగా ఎంపికయ్యారు. 'మోదీ' ఇంటిపేరు విషయంలో ఆయన చేసి వ్యాఖ్యలపై పరువు నష్టం దావా ఉండటం, గుజరాత్ కోర్టు ఆయన్ను దోషిగా నిర్ధారించడంతో ఈ ఏడాది మార్చి 24న రాహుల్ లోక్‌సభ సభ్యత్వం రద్దైన సంగతి తెలిసిందే. అయి తే.. గుజరాత్ కోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించడంతో ఈ నెల 7న రాహుల్ లోక్‌సభ సభ్యత్వం తిరిగి ఆయనకు లభించింది. దీంతో ఆయన గతంలోనే సభ్యుడిగా ఉన్న స్టాండింగ్ కమిటీకి తిరిగి ఎంపికైనట్లు లోక్‌సభ బులెటిన్ తెలిపింది. ఇక కాంగ్రెస్ ఎంపీ అమర్ సింగ్ సైతం అదే కమిటీకి ఎంపికయ్యారు. ఆప్ ఎంపీ సుశీల్ కుమార్ రింకు, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఫైజల్ పీపీ మహమ్మద్‌లు స్టాండింగ్ కమిటీల్లో సభ్యులుగా ఎంపికయ్యారు.

# దాదాపుగా ఖరారు

# తొలి 'దండు'ను సిద్ధం చేసిన కేసీఆర్?




**హైదరాబాద్: తెలంగాణలో ఎన్నికల హీట్ మొదలైంది. మరికొన్ని నెల్లలో అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపిక విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. అధికార పార్టీ సైతం అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. వివరాల ప్రకారం.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ సీఎం కేసీఆర్ స్పీడ్ పెంచారు. బీఆర్ఎస్ అభ్యర్థుల తొలి జాబితాను కేసీఆర్ సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ క్రమంలో ఈనెల 21న కేసీఆర్ తొలి జాబితాను విడుదల చేయనున్నారు. బీఆర్ఎస్ నుంచి సుమారు 80 నుంచి 90 మంది అభ్యర్థుల లిస్టను రెడీ చేసినట్టు సమాచారం. వీరిలో ఎక్కువ మంది సిట్టింగ్‌లు ఉన్నట్టు తెలుస్తోంది.**

**బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా అంచనా ప్రకారం..**

**ఉమ్మడి ఆదిలాబాద్..** చెన్నూరులో బాల్క సుమన్, అదిలాబాద్‌లో జోగు రామన్న, బోథ్‌లో రాథోడ్ బాపురావు, ఆసిఫాబాద్‌లో ఆత్రం సక్కు, నిర్మల్‌లో ఇంద్రకరణ్ రెడ్డి.

**ఉమ్మడి నిజామాబాద్** : ఆర్మూర్‌లో జీవన్ రెడ్డి, బోధన్‌లో షకీల్, బాన్సువాడలో పోచారం శ్రీనివాస్, నిజామాబాద్ అర్బన్‌లో గణేష్ బిగాలా, నిజామాబాద్ రూరల్‌లో బాజిరెడ్డి గోవర్ధన్, బాల్కొండలో వేముల ప్రశాంత్ రెడ్డి.

**కరీంనగర్** : కరీంనగర్‌లో గంగుల కమలాకర్, సిరిసిల్లలో కేటీఆర్, మనకొండురులో రసమయి బాలకిషన్, రామగుండంలో కోరుగంటి చందర్, కోరుట్లలో విద్యాసాగర్ రావు/ సంజీవ్, హుస్నాబాద్‌లో ఒడితల సతీష్.

**మెదక్** : సిద్దిపేటలో హరీష్ రావు, దుబ్బాకలో కొత్త ప్రభాకర్ రెడ్డి, గజ్వేల్‌లో కేసిఆర్, పఠాన్ చేరులో గూడెం మహిపాల్ రెడ్డి.

**రంగారెడ్డి జిల్లా** మేడ్చల్‌లో మల్లారెడ్డి., మల్కాజ్‌గిరిలో మైనంపల్లి హన్మంతరావు, కుత్బుల్లాపూర్‌లో కేపీ వివేకానంద, కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు, ఇబ్రహీంపట్నంలో మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఎల్బీనగర్‌లో దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, మహేశ్వరంలో సబితా ఇంద్రారెడ్డి, శేర్లింగంపల్లిలో అరికెపూడి గాంధీ, వికారాబాద్‌లో మెతుకు ఆనంద్, తాండూరులో పైలెట్ రోహిత్ రెడ్డి.

**హైదరాబాద్** : ముషీరాబాద్‌లో ముఠాగోపాల్, ఖైరతాబాద్‌లో దానం నాగేందర్, జూబ్లీహిల్స్‌లో మాగంటి గోపీనాథ్, సనత్ నగర్‌లో తలసాని శ్రీనివాస్, సికింద్రాబాద్‌లో పద్మారావు.

**మహబూబ్ నగర్** : కొడంగల్‌లో పట్నం నరేందర్ రెడ్డి, జడ్చర్లలో లక్ష్మారెడ్డి, మహబూబ్‌నగర్‌లో శ్రీనివాస్ గౌడ్, దేవరకద్రలో ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మక్తల్‌లో చిట్టెం రామ్మోహన్ రెడ్డి, వనపర్తిలో నిరంజన్ రెడ్డి, నాగర్ కర్నూల్‌లో మర్రి జనార్దన్ రెడ్డి.

**నల్గొండ** సూర్యాపేటలో జగదీష్ రెడ్డి, నల్గొండలో కంచర్ల భూపాల్ రెడ్డి, హుజూర్‌నగర్‌లో శానంపూడి సైదిరెడ్డి, భువనగిరిలో పైళ్ల శేఖర్ రెడ్డి, నకిరేకల్‌లో చిరుమర్తి లింగయ్య, తుంగతుర్తిలో గాదరి కిషోర్, ఆలేరులో గొంగిడి సునీత,

**ఖమ్మం** పినపాకలో రేగా కాంతారావు, ఇల్లందులో బానోతు హరిప్రియ నాయక్, ఖమ్మంలో పువ్వాడ అజయ్, పాలేరులో కందాల ఉపేందర్ రెడ్డి, సత్తుపల్లిలో సండ్ర వెంకట వీరయ్య.

**ఉమ్మడి వరంగల్** : పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్ రావు, నర్సంపేటలో పెద్ది సుదర్శన్ రెడ్డి, పరకాలలో చల్ల ధర్మారెడ్డి, వరంగల్ పశ్చిమలో దాస్యం వినయ్ భాస్కర్, వరంగల్ తూర్పులో వద్దిరాజు రవిచంద్ర, స్టేషన్ ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరి, జనగాంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి, వర్ధన్నపేటలో ఆరూరి రమేష్, భూపాలపల్లిలో గండ్ర వెంకట రమణారెడ్డి.

# ఉమ్మడి ఖమ్మం జిల్లాపై సీఎం కేసీఆర్ స్పెషల్ ఫోకస్..!

## కాంగ్రెస్‌లో చేరిన నెలన్నరకే పొంగులేటికి షాక్!

ఖమ్మం : తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే ఏకైక లక్ష్యమంటూ కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించడాన్ని సీఎం కేసీఆర్ సీరియస్‌గా తీసుకున్నారా?. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది సీట్లలో హస్తంపార్టీని గెలిపిస్తానంటూ పొంగులేటి పదేపదే చెబుతుండడాన్ని గులాబీ బాస్ సవాలుగా స్వీకరించారా?. ఉమ్మడి ఖమ్మంలో పట్టు సాధించేందుకు పక్కా వ్యూహాలను సిద్ధం చేశారా?.. అనే ప్రశ్నలకు రాజకీయ వర్గాలు ఔననే అభిప్రాయాలనే వ్యక్తం చేస్తున్నాయి. ఇంతకీ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి తాజా రాజకీయ పరిణామం ఏంటి?. కేసీఆర్ దృష్టిసారించింది దేనిపై?.. రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న టాక్ ఏంటో ఈ కథనంలో చూద్దాం.. జులై మొదటి వారంలో అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో తన అనుచరగణంతో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి బీఆర్ఎస్ చిన్నపాటి షాకిచ్చింది. పొంగులేటి ముఖ్యఅనుచరుల్లో ఒకరు, భద్రాచలం నియోజకవర్గానికి చెందిన తెల్లం వెంకట్రావ్‌ను తిరిగి పార్టీలోకి తీసుకెళ్లడంలో బీఆర్ఎస్ ప్రయత్నాలు సక్సెస్ అయ్యాయి. మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌తోపాటు పలువురు ముఖ్యనేతల సమక్షంలో తెల్లం వెంకట్రావ్ గురువారం గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. గత ఎన్నికల్లో భద్రాచలం నుంచి బీఆర్ఎస్ తరపున బరిలో నిలిచిన తెల్లం వెంకట్రావ్.. కాంగ్రెస్ తరపున పోటీ చేసిన పోదెం వీరయ్య చేతిలో ఓటమిపాలయ్యారు. దాదాపు నాలుగేళ్లపాటు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జిగా కొనసాగిన తెల్లం జులైలో పొంగులేటితో కలిసి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అయితే భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్యను కాదని కాంగ్రెస్ టికెట్ దక్కే పరిస్థితి లేకపోవడాన్ని గమనించిన తెల్లం వెంకట్రావ్ హస్తంపార్టీని వీడడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. టికెట్ విషయంలో




పొంగులేటి నుంచి కూడా హామీ లభించకపోవడం... మరోవైపు బీఆర్ఎస్ నుంచి సీటు కన్ఫార్మ్ అని హామీ రావడంతో ఆయన నెలన్నర రోజుల్లోనే కాంగ్రెస్ నుంచి తిరిగి బీఆర్ఎస్‌లోకి జంపయ్యారు. కాంగ్రెస్‌లో కొనసాగాలని స్వయంగా పొంగులేటి రంగంలోకి దిగినా వెంకట్రావ్ సున్నితంగా తోసిపుచ్చారని ప్రచారం జరుగుతోంది. పోటీకిదే తనకు చివరి అవకాశమని వివరించినట్టు తెలుస్తోంది. మరోవైపు.. భద్రాచలం నుంచి సరైన అభ్యర్థి లేకపోవడం బీఆర్ఎస్‌కు మైనస్ కాగా.. వెంకట్రావ్‌కు ఇది అవకాశంగా మరింది. దీంతో టికెట్ హామీతోనే పార్టీలోకి తిరిగొచ్చినట్టు తెలుస్తోంది. ఇదిలావుండగా.. తెల్లం వెంకట్రావ్‌ని తిరిగి పార్టీలో చేర్చుకోవడం ద్వారా పొంగులేటికి కూడా ఝలక్ ఇచ్చినట్టు ఉంటుందని బీఆర్ఎస్ లెక్కలు వేసిందట. ఇక ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పటిష్టంగా ఉన్న కాంగ్రెస్‌కు షాక్ తగిలినట్టవుతుందని అంచనా వేసిన బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా మరిన్ని చేరికలను ప్రోత్సహించిన ఆశ్చర్యపోవాల్సిందేమీలేదని చర్చ నడుస్తోంది. రానున్న రోజుల్లో మరిన్ని నియోజకవర్గాల్లో కీలకమైన నేతలను బీఆర్ఎస్ వైపు ఆకర్షించి ఎన్నికల నాటికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పట్టుసాధించాలని గులాబీ పార్టీ ఉవ్విళ్లూరుతోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నారు. ఇందుకు సంబంధించి త్వరలో కీలకమైన చేరికలు ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని అభిప్రాయపడుతున్నారు. మరి బీఆర్ఎస్ వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయి? వాటికి పొంగులేటి ప్రతివ్యూహాలు ఏ విధంగా ఉంటాయి? అనేవి రానున్న రోజుల్లో తేలిపోనుంది.



## అధికార బీఆర్ఎస్‌లో కొత్త ట్రెండ్

హైదరాబాద్: బీఆర్ఎస్‌లో టిక్కెట్ల పంచాయతీ ముదిరింది. పార్టీలో నేతల మధ్య విబేధాలు భగ్గుమంటున్నాయి. సిట్టింగ్‌లకు వ్యతిరేకంగా అసమ్మతి వర్గం నేతలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేలకు టిక్కెట్ ఇవ్వొద్దని తీర్మానాలు చేస్తున్నారు. మొదటి లిస్టు విడుదలకు బీఆర్ఎస్ అధిష్టానం రెడీ అవుతుండడంతో అధికారపార్టీలో ఆశావహులు స్పీడ్ పెంచారు. దాదాపు 50 నియోజక వర్గాల్లో కొట్లాటలు పీక్ స్టేజ్‌కు చేరాయి. అధినాయకత్వం ఎవరికి టిక్కెట్ ఇస్తే వారికోసమే పార్టీ శ్రేణులన్నీ పనిచేయడమే తెలిసిన బీఆర్ఎస్‌లో ఈసారి కొత్త ట్రెండ్ మొదలైంది. పార్టీలో అంసతృప్తుల స్థాయి అసమ్మతిని దాటి మరింత తీవ్రరూపం దాల్చించి. 'మా ఎమ్మెల్యేకు టిక్కెట్ ఇవ్వొద్దు.. ఇస్తే ఓడిస్తాం' అంటూ సొంతపార్టీ నేతలే అధిష్టానానికి అల్టిమేటం జారీ చేసే స్థాయికి చేరింది. రానున్న అసెంబ్లీ ఎన్నికలు బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను త్వరలో ప్రకటించనున్న నేపథ్యంలో ఇంతకాలం అంతర్గతంగా ఉన్న అభిప్రాయ బేధాలు బట్టబయలవుతున్నాయి.



## షర్మిల ఏక్షణమైనా ఢిల్లీ వెళ్ళే అవకాశం!

హైదరాబాద్: వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ.. కాంగ్రెస్‌లో విలీనానికి రంగం సిద్ధమైనట్లు సమాచారం. కాంగ్రెస్ హైకమాండ్ పిలుపుతో ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఏక్షణమైనా ఢిల్లీ వెళ్ళే అవకాశం ఉన్నట్లు సమాచారం. రెండు, మూడు రోజుల్లో భర్త అనిల్ తో కలసి షర్మిల ఢిల్లీకి వెళ్లనున్నారు. షర్మిల దంపతులు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక గాందీ లను కలవనున్నారు.

మరోవైపు రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్‌టీపీకి చెందిన తన అనుచరులకు కనీసం ఐదు అసెంబ్లీ సీట్లు ఇవ్వాలని షర్మిల డిమాండ్ చేస్తున్నారు. అయితే రెండు లేదా మూడు అసెంబ్లీ సీట్లకు కాంగ్రెస్ పార్టీ ఒప్పుకునే అవకాశం ఉన్నట్లు తెలియవచ్చింది.

ఇంకోవైపు షర్మిలను ఏపీ రాజకీయాలకే పరిమితం చేయాలని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి వర్గం అంటోంది. కాగా షర్మిల పార్టీ కాంగ్రెస్‌లో విలీనంపై ఈనెల 20లోపు స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ఎన్నికలపై ఫోకస్ పెట్టిన బీజేపీ

ఖమ్మం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణ ఎన్నికలపై మరింత ఫోకస్ పెట్టారు. బీజేపీ రాష్ట్ర కమిటీలో చేర్పులపై కిషన్ రెడ్డి కసరత్తు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో పాత వారిని కొనసాగిస్తూనే.. కొత్తవారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే అధ్యక్షుడు బీజేపీ రాష్ట్ర కమిటీని కిషన్ రెడ్డి ప్రకటించనున్నారు. ప్రస్తుతం ఢిల్లీలోనే కిషన్ రెడ్డి ఉన్నారు. ఇద్దరు ఉపాధ్యక్షులు, ఇద్దరు సెక్రటరీలు, నలుగురు అధికార ప్రతినిధులకు కొత్తగా అవకాశం లభించనుంది. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల కోసం 22 కమిటీలను ఏర్పాటు చేయాలని బీజేపీ నిర్ణయం తీసుకుంది. మేనిఫెస్టో కమిటి, చార్జ్ షీట్ కమిటి, మీడియా కమిటి, ఎలక్షన్ ఆఫీస్ అండ్ మేనేజ్‌మెంట్ కమిటి, బహిరంగ సభల నిర్వహణ కమిటి, జాతీయ నేతల టూర్స్ సమన్వయ కమిటి, సోషల్ మీడియా కమిటి, పబ్లిక్ సిటి కమిటి, ఎన్నికల సామాగ్రి పంపిణీ కమిటి సహా.. 22 కమిటీలను కిషన్ రెడ్డి ప్రకటించనున్నారు. కాగా రేపు కిషన్ రెడ్డి ఖమ్మం రానున్నారు. ఈ నెల 27న కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఖమ్మం పర్యటన సందర్భంగా ఏర్పాట్లపై ఆయన సమీక్షించనున్నారు. ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ దగ్గర నుంచి కిషన్ రెడ్డికి స్వాగతం పలికి, బైక్ ర్యాలీగా టూ టౌన్ పోలీస్ స్టేషన్ వరకూ తీసుకురావాలని బీజేపీ జిల్లా కమిటీ నిర్ణయం తీసుకుంది. రేపు మధ్యాహ్నం రెండు గంటలకు వీవీసీ ఫంక్షన్ హాల్లో కార్యకర్తలు, ముఖ్య నేతలతో కిషన్ రెడ్డి సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు.



## సంపాదకీయం

## సోషల్ మీడియాపై ప్రత్యేక ఫోకస్!

ఇకనుండి నెటిజన్లు చాలా జాగ్రత్తగా ఉండాల్సిందే. లేకపోతే కేసులు మెడకు చుట్టుకోవటం ఖాయం. ఎందుకంటే సోషల్ మీడియా పోస్టులపై పోలీసులు ప్రత్యేకమైన నిఘా మొదలుపెట్టారు. ఇందుకోసం ఏపీ పోలీసు శాఖ ప్రత్యేకంగా 130 మంది నిపుణులతో ప్రత్యేకమైన బృందాన్నే ఏర్పాటు చేసింది. ఈ బృందం అత్యంత ఆధునికమైన టెక్నాలజీ సాయంతో నిరంతరం సోషల్ మీడియా అకౌంట్లను పరిశీలిస్తుంటుంది. ప్రస్తుత రోజుల్లో సోషల్ మీడియాలో యాక్టివ్ గా లేని వాళ్ళు చాలా అరుదనే చెప్పాలి. సోషల్ మీడియాను వ్యక్తులు వాడడం కన్నా రాజకీయ పార్టీల వాడకమే చాలా ఎక్కువ. ఎన్నికలకు దగ్గరకు వచ్చేస్తున్నాయి కాబట్టి ప్రతి పార్టీ కూడా ప్రత్యేకంగా సోషల్ మీడియా విభాగాన్ని ఏర్పాటు చేసుకున్నది. అందులో వందలాది మందిని రిక్రూట్ చేసుకుని తమ పార్టీ ప్రచారాన్ని చేయించుకుంటున్నది. తమ పార్టీకి అనుకూలంగా ప్రచారాలు చేయించుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కానీ తమను పాజిటివ్ గా హైలైట్ చేయించుకుంటునే మరోవైపు ప్రత్యర్థిపార్టీలపై బాగా నెగిటివ్ ప్రచారం చేయిస్తున్నాయి. సమస్యంతా ఇక్కడే వస్తున్నది. ఈ సమస్య కూడా రెండురకాలుగా ఉంటోంది. మొదటిదేమో పార్టీలే ప్రత్యర్థిపార్టీలపై నెగిటివ్ ప్రచారం చేయించటం. రెండో సమస్య ఏమిటంటే పార్టీల అభిమానులు, పార్టీలో క్రియాశీలకంగా పనిచేసే వాళ్ళు తమంతట తాముగానే ప్రత్యర్థిపార్టీలను గబ్బుపట్టించటం. రెండు పద్దతులు ఇపుడు ఎక్కువపోవటంతోనే గొడవలు పెరిగిపోతున్నాయి. కొన్నిసార్లు సోషల్ మీడియాలో కనిపించే పోస్టుల వల్ల శాంతి భద్రతల సమస్యలు కూడా పెరిగిపోతున్నాయి. అందుకనే ఏపీ పోలీసులు ప్రత్యేకంగా సోషల్ మీడియా ను మానిటర్ చేయటం కోసమే 130 మంది నిపుణులతో ప్రత్యేక టీమును ఏర్పాటు చేసింది. ఈ టీము ఫేస్ బుక్, వాట్సప్, ఇన్ స్టాగ్రామ్, ట్విట్టర్ ఖాతాలపై నిరంతర నిఘా పెడుతుందని డీజీపీ రాజేంద్రనాధరెడ్డి చెప్పారు. సమాజంలో అశాంతిని రేకెత్తించటమే టార్గెట్ గా పనిచేసే వాళ్ళపై కేసులు పెట్టి కఠినంగా శిక్షించటానికే ప్రత్యేక నిపుణులతో పోలీసు శాఖ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు అవసరమైతే నిపుణులను పిలిపించే వాళ్ళు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా టీమునే ఏర్పాటు చేసేశారు.

## రహదారుల నిర్మాణంలో ఇష్టారాజ్యం



ములుగు : మన్యంలోని రహదారుల అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు పాతరేస్తున్నారు. రూ. కోట్ల నిధులు వ్యయం చేస్తున్నా నాసిరకం పనులతో ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, పర్సంటేజీల యావతో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పదికాలాల పాటు మన్నికగా ఉండాల్సిన ప్రజోపయోగ పనులను కాంట్రాక్టర్లు ఉపాధి మార్గాలుగా మార్చుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా వెంకటాపురం మండలంలో నిర్మిస్తున్న రూ. 2.20 కోట్లు సిమెంట్ రహదారుల పనుల్లో నిబంధనలకు తూట్లు పెడుతున్నారు.

నాణ్యత నగుబాటు

గ్రామీణ పల్లెల్లోని మట్టిరోడ్లను ఆధునికీకరించేందుకు గాను ఈజీఎస్ ద్వారా ప్రభుత్వం నిధులను కేటాయించింది. అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలతో 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను మండల వ్యాప్తంగా 29 రహదారులను మంజూరు చేసింది. ఇందుకు గాను రూ. 2.20 కోట్ల నిధులను మంజూరు చేశారు. వెంకటాపురం పంచాయతీరాజ్ సబ్ డివిజన్ ఇంజినీరింగ్ కార్యాలయం పర్యవేక్షణలో నామినేషన్ పద్ధతిలో ఈ పనులు చేపట్టేలా ఉత్తర్వులు జారీ చేశారు. అనుభవం లేని వ్యక్తులు గుత్తేదారులుగా అవతారమెత్తి లోపాయికారిగా పర్సంటేజీలను ముట్టజెప్పి ఉపాధి రోడ్లను దక్కించుకున్నారన్న ఆరోపణలున్నాయి.

పర్సంటేజీలతో అడ్డదారులు!పర్సంటేజీల కక్కుర్తితోనే రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత పక్కదారి పడుతోందనే విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. ఈ పనులను దక్కించుకోవడంతో పాటు నాసిరకం నిర్మాణాలు, బిల్లుల చెల్లింపులకు గాను రూ. 5 లక్షల వ్యయంతో చేపట్టిన రహదారికి ఒక్కో గుత్తేదారు 10 నుంచి 12 శాతం పర్సంటేజీల రూపంలో పలువురికి ముట్టజెప్పాల్సి వస్తోందని తెలుస్తోంది. ఈ క్రమంలో అడ్డదారిలో నిర్మాణాలు చేపట్టకపోతే ఎలా ఉపాధి పొందాలనే వాదనలు వినిపిస్తున్నాయి.

గుత్తేదారులను హెచ్చరిస్తున్నాం:-రాజేశ్, ఏఈఈ, పీఆర్

సిమెంట్ రహదారుల నిర్మాణాల్లో ప్రమాణాల విషయంపై గుత్తేదారులను హెచ్చరిస్తున్నాం. ఎస్సీమద్రిగూడెం, రంగరాజపురం ప్రాథమిక పాఠశాల సమీప వీధిలో జరిగిన పనుల్లో లోపాలు ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇతర ప్రాంతాల్లో చేపట్టిన పనులను పర్యవేక్షిస్తున్నాం. నిర్మాణాలను నాణ్యత విభాగం అధికారులు పర్యవేక్షించి నిర్ధారించాకే బిల్లులు చెల్లిస్తాం.

పర్యవేక్షించే అధికారులు ఎక్కడ?

మండల కేంద్రంలోని ఎస్సీమద్రిగూడెంలో రూ. 10 లక్షలు, రంగరాజపురం ప్రాథమిక పాఠశాల సమీప వీధిలో రూ. 10 లక్షలతో, అప్పాలవీధిలో నిర్మించిన రోడ్ల పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయి. మట్టి రోడ్లను చదును చేసి తొలుత సుమారు 4 అంగుళాల మందంతో జీఎస్‌బీని పరచాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా చేపట్టారు. ఎస్సీమద్రిగూడెంలో అడ్డదారిలో చేపట్టిన ఈ పనులను శనివారం స్థానికులు నిలదీశారు. సిమెంట్, 20 ఎంఎం చిప్స్, ఇసుక సమపాళ్లలో కలపకుండా నాసిరకంగా పనులు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు అందుబాటులో లేకపోవడంతో గుత్తేదారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది.

## గిరిజన యువతకు ఉపాధి వెలుగులు




మహబూబాబాద్ : గిరిజన యువతీ, యువకుల జీవితాల్లో ఉపాధి వెలుగులు నింపేందుకు గిరిజన సంక్షేమ శాఖ ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఐటీడీవో పీవో అంకిత్ ఆదేశాల మేరకు లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు శిక్షణ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గిరిజనులు అధికంగా ఉన్న మహబూబాబాద్ ప్రాంతంలో నిరుద్యోగులైన గిరిజన యువతీ, యువకులకు వృత్తి శిక్షణ ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు దశాబ్దం కిందట మహబూబాబాద్‌లో అప్పటి ప్రభుత్వం చేసిన రూ. 4 కోట్ల నిధులతో జీ-ప్లస్ టు భవన సముదాయాన్ని నిర్మించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత నూతన జిల్లాలు ఏర్పాటు కావడంతో ఆ భవన సముదాయాన్ని కలెక్టరేట్‌కు కేటాయించారు. దీంతో ఈ ప్రాంతానికి చెందిన గిరిజన యువతీ, యువకులు వృత్తి శిక్షణకు దూరమయ్యారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా ప్రస్తుత ఐటీడీఏ పీవో అంకిత్ జిల్లా కేంద్రంలోని వివిధ రంగాల్లో శిక్షణ ఇప్పించేందుకు చర్యలు చేపట్టారు. ఇటీవల ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అలాగే శిక్షణ కేంద్రంలో చేస్తున్న ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.మొదటి విడతలో మూడు రంగాల్లో శిక్షణ

జిల్లాలోని పదో తరగతి నుంచి డిగ్రీ, ఇతర వృత్తి విద్య, సాంకేతిక విద్యార్హత కలిగి 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయస్సు ఉన్న నిరుద్యోగులకు ఉపాధి రంగాల్లో వృత్తి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణతో పాటు భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారు. మొదటి విడతలో మూడు రంగాల్లో 90 మందిని ఎంపిక చేశారు. ఒక్కో రంగంలో 30 మంది చొప్పున వారు కోరుకున్న రంగంలో వృతి నైపుణ్య కలిగిన నిపుణులతో ఉచిత శిక్షణ ఇచ్చి ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. మహబూబాబాద్‌లో మొదటి సారిగా ప్రారంభం కానున్న వృత్తి శిక్షణ కేంద్రంలో సోలార్ టెక్నీషియన్ విభాగంలో రెండు నెలలు, హోటల్ మేనేజ్‌మెంట్‌లో 2 నెలలు, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్‌లో 90 రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. కాలపరిమితి ముగియగానే మరో బృందానికి శిక్షణ ఇస్తారు. నిరంతర ప్రక్రియలా ఏడాది పొడవునా కొనసాగనుంది. లైఫ్ ఫౌండేషన్ సంస్థ ద్వారా వివిధ విభాగాల్లో శిక్షణ ఇచ్చి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారు.ప్రయివేటు రంగంలో ఉద్యోగాన్ని పొందేందుకు ఈ శిక్షణ ఉపయోగపడనుంది. రూ. 10 నుంచి 15 వేల వరకు ప్రైవేట్ సంస్థల్లో వేతనం పొందవచ్చు. సొంతంగా కూడా ఈ రంగాలకు సంబంధించి వృత్తిలో రాణిస్తూ సొంతంగా ఉపాధి పొందే అవకాశం ఉంది. ఈ రంగాల్లో ప్రైవేట్‌లో శిక్షణ పొందాలంటే ఒక్కొక్కరికీ రూ. 20 నుంచి 30 వేల ఖర్చు వస్తుంది. అందుకోసం ఆర్థికంగా వెనకబడిన గిరిజన యువతీ, యువకులకు ఉచిత వసతి, వృత్తి శిక్షణ ఇచ్చేందుకు నిర్వహిస్తున్న ఈ శిక్షణ కేంద్రం ద్వారా జిల్లాలో వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. దశలవారీగా మరిన్ని రంగాల్లో వృత్తి శిక్షణ ఇచ్చేందుకు అధికారులు యోచిస్తున్నారు.

## అల వైకుంఠధామం!

ములుగు : హనుమకొండ నగరం నడిబొడ్డున వైకుంఠధామం అదరహో అనిపిస్తోంది. రాష్ట్రంలోనే గ్రేటర్ వరంగల్ పరిధిలోని వాజ్‌పేయి కాలనీలోని ఈ వైకుంఠధామం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవనుంది. ఈనెల 5న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీ.రామారావు చేతుల మీదుగా ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనతో పట్టణాల్లో వైకుంఠధామాలకు శ్రీకారం చుట్టారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం హనుమకొండ ప్రాంతం 57వ డివిజన్ వాజ్‌పేయి కాలనీలో 2.5 ఎకరాల సువిశాలమైన స్థలాన్ని ఎంపిక చేశారు. సీఎం హామీల పథకం ద్వారా రూ. 2 కోట్లు, బల్దియా సాధారణ నిధుల ద్వారా రూ. 1.96 కోట్లు, మొత్తం రూ. 3.96 కోట్లతో ఆధునిక హంగులతో వైకుంఠధామం ముస్తాబైంది. అబ్బురపరిచే స్వాగత ద్వారాలు, గ్రీనరీ, పూలు,



ఆకర్షణీయమైన మొక్కలు కనువిందు చేస్తున్నాయి. శివుని బొమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. బయట, లోపల చూస్తే కార్పొరేట్ కార్యాలయాలను తలపిస్తుంది. హైదరాబాద్ మహా ప్రస్థానం కంటే ఆధునిక హంగులు కల్పించారు. మూడు, నాలుగు డివిజన్ల ప్రజలకు ఉపయోగపడనుంది.

## ఇరుకాసుపత్రి

కామారెడ్డి : జిల్లా ఆసుపత్రిలో వివిధ విభాగాలన్నీ ఒకే చోట ఉండటంతో ఇరుకుగా మారి సేవలకు అవరోధంగా మారింది. ఆసుపత్రి పై భాగాన కొత్తగా అదనపు పడకలకు షెడ్లు నిర్మిస్తున్నారు. వైద్యకళాశాల మంజూరైన నేపథ్యంలో ప్రస్తుత భవనం ఆవరణలోనే పడకలు చూపడంతో అనుమతులొచ్చాయి. ఇప్పటివరకు షెడ్లు మాత్రం పూర్తికాలేదు. స్థలం లేక రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్త వైద్యకళాశాల నిర్మాణం పూర్తికావడానికి రెండేళ్లు పట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ సారి వైద్యకళాశాల తరగతులు ప్రారంభం నేపథ్యంలో అందుబాటులో ఉన్న చోట నిర్వహణ కొనసాగించేందుకు యంత్రాంగం చర్యలు చేపడుతోంది.

ఆవరణలో స్థలం లేక

ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు వందల వాహనాలను ఆసుపత్రి ఎదుట నిలుపుతున్నారు. పార్కింగ్ స్థలం లేక ఇబ్బందవుతోంది. 30 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం శిథిలదశకు చేరింది. పై అంతస్తులో షెడ్ల నిర్మాణానికి డ్రిల్లింగ్ చేయడంతో గోడలు బీటలు వారుతున్నాయి. వర్షాకాలంలో గదుల్లో నీరు చేరుతోంది.

ఎంసీహెచ్ ఆశలు ఆవిరి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో వంద పడకల ఎంసీహెచ్ భవనం నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఓ వైపు వైద్యకళాశాల మంజూరైంది. ప్రస్తుతానికి నూతనంగా నిర్మించే ఎంసీహెచ్‌ను కళాశాల నిర్వహణకు కేటాయించారు. స్టేషన్‌రోడ్డులోని జిల్లా ఆసుపత్రిలో మాతాశిశు సంరక్షణ సేవలు అందనున్నాయి. సుదీర్ఘకాలంగా కామారెడ్డి ప్రాంతానికి ఎంసీహెచ్ కోసం నిరీక్షించిన తరుణంలో తాజా పరిణామాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. రెండు నుంచి మూడేళ్ల పాటు జిల్లాకేంద్రంలో కష్టాలు తప్పేట్టుగా లేవు.

నిబంధనల మేరకే నిర్మాణం

ప్రస్తుతం అందుబాటులో ఉన్న చోటే అన్ని రకాల వైద్యసేవలు అందుతున్నాయి. ఆసుపత్రికి వచ్చేవారితో ఇరుకిరుకుగా మారింది. వైద్యకళాశాల మంజూరైన నేపథ్యంలో 330 పడకలు చూపాలనే నిబంధనల నేపథ్యంలో షెడ్ల నిర్మాణం జరుగుతోంది.

డా. శ్రీనివాస్, ఆర్ఎంవో

పడకల కొరత

జిల్లా ఆసుపత్రిలో డయాలసిస్‌కు కేవలం 5 పడకలు మాత్రమే కేటాయించారు. వందలాది రోగులు వస్తుండడంతో పడకల కోసం పేచీ పడే పరిస్థితులు నెలకొన్నాయి. 15 పడకలు అవసరమని ప్రతిపాదనలు అందజేసినా ఆసుపత్రిలో స్థలం లేక మంజూరుకావడం లేదు. ఐసీయూలో 20 మందిని ఉంచాల్సిన పరిస్థితి ఉండగా 10 పడకలు ఉన్నాయి. నిత్యం 15-20 ప్రసవాలు జరుగుతుంటాయి. బాలింతలకు అయిదు రోజుల పాటు చికిత్స అందజేయాలి. దీంతో పడకల కొరత ఏర్పడుతోంది. ట్రామాకేర్ కేంద్రాన్ని 10 పడకలతో ఏర్పాటు చేశారు. ఈ విభాగంలో రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారికి చికిత్స అందాల్సి ఉన్నా ఇతర రోగులను ఇందులోకి చేర్చుతున్నారు.

## కొనుగోళ్లలో జాప్యం.. రైతుకు శాపం

కామారెడ్డి :చిత్రంలో కనిపిస్తున్న వరి కుప్పలు రాజంపేట మండలం పొందుర్తి గ్రామానికి చెందిన రైతులవి. ఇక్కడ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు గత పది రోజులుగా ధాన్యాన్ని తీసుకువస్తున్నారు. వరకు95 మంది రైతులు ధాన్యం తీసుకురాగా కేవలం 14 మంది రైతుల నుంచి 798 కింటాళ్ల ధాన్యం మాత్రమే తూకం వేసి మిల్లులకు తరలించారు. మిగతా రైతులు నిత్యం ధాన్యాన్ని ఎండకు ఆరబెడుతూ వర్షానికి కాపాడుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. ఆరుగాలం శ్రమించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాత అరిగోస పడుతున్నాడు. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లపై అధికారులు నెలన్నర రోజుల కిందటే ప్రణాళికలు రూపొందించుకుని సిద్ధంగా ఉన్నా పంటను వెనువెంటనే కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తున్నారు. కేంద్రాలు ప్రారంభించారే తప్ప ఎలాంటి కొనుగోళ్లు చేపట్టలేదు. ఈలోపు వడగళ్ల వర్షం కురియడంతో చాలామంది రైతుల ధాన్యం తడిసింది. వేలాది మంది రైతులు పంట నష్టపోయారు.

188 మాత్రమే ప్రారంభంయాసంగి సీజన్ ధాన్యం సేకరణకు జిల్లా వ్యాప్తంగా 350 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని అధికారులు ప్రణాళికలు రూపొందించగా శనివారం వరకు 188 కొనుగోలుకేంద్రాలు మాత్రమే ప్రారంభించారు. ఇందులో 50 శాతం కేంద్రాల్లో 30వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. 162 కేంద్రాలు ఇంకా ప్రారంభించాల్సి ఉంది. మరో 90 కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేయాల్సి ఉంది. ఈ సీజన్‌లో మొత్తంగా 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు.

మొలకలు వస్తుండడంతో..

జిల్లా వ్యాప్తంగా వారం రోజుల నుంచి అకాలవర్షాలు కురుస్తున్నాయి. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన వందలాది మంది రైతుల ధాన్యం తడిసిపోయింది. కొందరు రైతులు అదే ధాన్యాన్ని ఎండకు ఆరబెట్టి విక్రయిస్తున్నారు. ధాన్యాన్ని కుప్పలుగా పోయడంతో మొలకలు వస్తున్నాయి. వడగళ్ల వర్షం కురిసిన రోజు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు. కాని ఎక్కడా తడిచిన ధాన్యం కొనుగోలు చేయడం లేదు.

క్రమసంఖ్య వచ్చే వరకు ఆగాల్సిందే..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలంటే ధాన్యంలో 17 శాతంలోపే తేమ ఉండాలి. అలా ఉన్నా తూకం వేయడం లేదు. వారి వరుస సంఖ్య వచ్చే వరకు ఆగాలని నిర్వాహకులు పేర్కొంటున్నారు. దీంతో రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. ధాన్యం కుప్పలపై కప్పడానికి కవర్లను అద్దెకు తెచ్చుకుంటున్నారు.

కుప్పలకు కాపలా కాస్తున్నా..

మూడెకరాల్లో వరి సాగు చేశా. ఇటీవలి వర్షాలకు 25 శాతం పంట నేలరాలింది. మిగిలిన ధాన్యాన్ని వారం కిందట కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాను. మొన్నటి వర్షానికి ధాన్యం తడిచిపోయింది. తిరిగి ఆరబెట్టాను. నిబంధనల మేరకు తేమశాతం వచ్చినా నా వరుస సంఖ్య వచ్చే వరకు తూకం వేయమని చెప్పారు. ధాన్యాన్ని కుప్పగా పోగు చేసుకుని కాపలా కాస్తున్నా.

పని గంగారాం, రైతు, పొందుర్తి

11 రోజుల కిందట తెచ్చా...నేను 7 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. 11 రోజుల కిందట ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాను. అకాల వర్షానికి కొంత ధాన్యం తడిసింది. మరికొంత ధాన్యం తడవకుండా కవర్లు కప్పుకొన్నారు. మా కేంద్రంలో సుమారు 200 మంది రైతులు ధాన్యంతో నిరీక్షిస్తున్నారు. ఇప్పటి వరకు తూకం ప్రారంభించలేదు.నర్రాగుల నర్సింలు, రైతు, దోమకొండప్రక్రియ వేగవంతం చేస్తున్నాంకొనుగోలు కేంద్రాలు తెరిచి ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రారంభించాం. ఊహించని విధంగా అకాల వర్షాలు వెంటాడుతుండడంతో ప్రక్రియ కాస్త నెమ్మదించింది. తూకం వేసిన చోటుకు లారీలను ముందే పంపిస్తున్నాం. ధాన్యం సేకరణను మున్ముందు మరింత వేగవంతం చేస్తాం.అభిషేక్, డీఎం, పౌరసరఫరాలశాఖ, కామారెడ్డి

# మనకు బోగి భాగ్యం!

వరంగల్ : విద్యా కేంద్రంగా పేరున్న ఓరుగల్లు ఇక నుంచి పరిశ్రమలకు నిలయంగా మారనుంది. ఇక్కడి ప్రజలు దశాబ్దాలుగా కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ రావాలని ఉద్యమాలు చేశారు. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం ప్రజల వినతులు మన్నించి బోగీలను తయారు చేసే యూనిట్తోపాటు రైళ్ల సర్వీసు చేసే పీవోహెచ్ మంజూరు చేసింది. దీనికి శనివారం ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. ః ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద పరిశ్రమగా ఇది నిలవనుంది. అనుబంధ పరిశ్రమలు రావడం వల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఇది సాంకేతికంగా అన్ని అంశాల్లో ముందు వరుసలో ఉంటుంది. ఉదాహరణకు కార్మికులకు రసాయనాల వల్ల హాని కలగకుండా బోగీలకు రోబో టెక్నాలజీతో రంగులు వేసే పరికరాలు ఇందులో ఉంటాయి. పరిశ్రమలో అనేక విభాగాలు ఉన్నాయి.. సిబ్బందికి పెద్ద క్యాంటీన్, సరిపడా మరుగుదొడ్లు, విశాలమైన పార్కింగ్, సకల సౌకర్యాలు కల్పిస్తారు.

పరిశ్రమ నుంచి కాలుష్యం బయటకు రాకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడానికి ఈ ప్రాంతంలో ఎక్కువగా చెట్లు పెంచుతారు. ఇదంతా పచ్చగా ఉంటుంది.

పరిపాలనా విభాగం ఇక్కడే ఉంటుంది. ముఖ్య అధికారులు, ఉన్నతాధికారుల కోసం నిర్మించిన అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్. సకల సదుపాయాలు ఉంటాయి.

ఇవన్నీ రైలు పట్టాలు. కాజీపేట జంక్షన్ వరకు వీటిని అనుసంధానం చేస్తారు. వ్యాగన్లు తయారు చేశాక బోగీలను ఈ పట్టాల వెంట బయటకు తీసుకొచ్చి, కావాల్సిన చోటికి తరలిస్తారు.

ఈ నాలుగు భారీ షెడ్లలో అనేక కార్యశాలలు ఏర్పాటుచేస్తారు. వ్యాగన్‌ల బరువు కొలిచే వై బ్రిడ్జ్, బోగీలను తయారు చేసే కేంద్రం, చక్రాలను తయారుచేసేవి, విడిభాగాలన్నీ తయారయ్యాక బిగించే 'బాడీ



అసెంబ్లీ షాప్', రోబో సాంకేతికతతో మనుషులు లేకుండా బోగీలకు రంగులు వేసే పెయింట్ షాప్ అన్నీ వీటిల్లోనే ఏర్పాటుచేస్తారు.

ఇవీ ప్రత్యేకతలు..కాజీపేట మండలం అయోధ్యపురంలో ఏర్పాటు చేయనున్న రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ పలు ప్రత్యేకతల సమాహారం. ఆ వివరాలు.. తయారీ సంస్థ: భారతీయ రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమ నిర్మాణ బాధ్యతలను రైల్వే నిగమ్ లిమిటెడ్‌కు అప్పగించింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో 24 నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తారు. ఖర్చు: రూ.521 కోట్లు. పూర్తిగా నిర్మాణం పూర్తయ్యే వరకు ఈ వ్యయం మరింత పెరగవచ్చు.

అవసరం: ప్రస్తుతం దేశంలో 22,790 మెట్రిక్ టన్నుల సరకు రవాణాకు మాత్రమే వ్యాగన్‌లు ఉన్నాయి. మరో 7000 మెట్రిక్ టన్నుల సరుకు రవాణాకు ఇవి అవసరం. కాజీపేటలో ఏర్పాటు చేయనున్న పరిశ్రమతో ఈ సమస్య తీరుతుంది.

ఉపాధి: మొదటి దశలో ఇతర ప్రాంతాల్లో పనిచేసే 1200 మంది రైల్వే ఉద్యోగులను బదిలీపై తీసుకు వస్తారు. పని పెరుగుతున్న కొద్ది ఉద్యోగుల సంఖ్య పెరుగుతుంది. ఉద్యోగులకు ప్రత్యేకంగా క్వార్టర్ల నిర్మాణం చేపడతారు.

పర్యావరణం: పరిశ్రమ కోసం నిర్మించిన షెడ్లకు గాజు గ్లాసులను అమర్చి సహజ వెలుగులను ఉపయోగించుకుని విద్యుత్తును ఆదా చేస్తారు.

సౌరవిద్యుత్తు: షెడ్లపైన సౌరఫలకలను ఏర్పాటు చేసి సౌర విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు.

ఆధునిక పరిజ్ఞానం: పరిశ్రమలో తయారైన వ్యాగన్‌లకు రోబోల ద్వారా రంగులు వేస్తారు.

లాభం: వ్యాగన్‌ల ఉత్పత్తి వల్ల రవాణా పెరిగి వ్యవసాయానికి ఊతం ఇస్తుంది. ఆన్సలరీ పరిశ్రమలు చుట్టుపక్కల వచ్చే అవకాశం ఉంది. సింగరేణి, సిమెంట్, ఎఫ్‌సీఐ పరిశ్రమలకు రవాణా కోసం త్వరగా రైళ్లను కేటాయించగలుగుతారు. కాజీపేటలో ఉద్యోగుల సంఖ్య పెరగడం వల్ల దీన్ని రైల్వే డివిజన్‌గా ప్రకటించే అవకాశం ఉంది.

## సిమెంట్ లైనింగ్ పనులు పూర్తయ్యేనా?

మెట్‌పల్లి : ఎస్సారెస్పీ కాకతీయ కాలువ సిమెంట్ లైనింగ్ పలుచోట్ల దెబ్బతినడంతో పూర్తిస్థాయిలో నీరు విడుదల కాక చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. కాకతీయ కాలువ లైనింగ్ పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినా పనులు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. 2016లో కొంత మేర పనులు చేపట్టగా ఇటీవల మళ్లీ లైనింగ్ పనులు మొదలు పెట్టగా కాలువకు నీరు విడుదల చేసే సమయానికి పూర్తవుతుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపై జిల్లాలో పలు గ్రామాలు సాగు, తాగునీటికి ఆధారపడ్డాయి. ఏళ్లుగా మరమ్మతులు జరగక పలు చోట్ల కాకతీయ కాలువ లైనింగ్ దెబ్బతింది. కాకతీయ కాలువ పూర్తి సామర్థ్యం 9600 క్యూసెక్కుల కాగా ఐదారు వేల క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేసే పరిస్థితి ఉంది. దీంతో ప్రభుత్వం లైనింగ్ నిర్మాణానికి నిధులు విడుదల చేసింది. 2016లో మెట్‌పల్లి మండలం వెల్లుల్లలో రూ.28.72 కోట్లతో 4వ కిలోమీటర్ నుంచి 68.3 కిలోమీటర్ వరకు లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. పలు చోట్ల పనులు ప్రారంభించారు. వెల్లుల్ల శివారులో లైనింగ్ పనులు చేపట్టారు. కొంత మేర పూర్తి చేసిన తర్వాత మళ్లీ పనులు కొనసాగడంలేదు. ఇటీవల మండలంలోని రామారావుపల్లె శివారులో 47.160 నుంచి 50.130 కిలోమీటర్ వరకు రూ.7.60 కోట్లతో లైనింగ్ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. కాలువకు నీరు విడుదల చేయకముందే పనులు పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నాణ్యత పాటిస్తేనే..లైనింగ్ పనులు హడావుడిగా కాకుండా నాణ్యతతో చేస్తేనే పదికాలాల పాటు మన్నికగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2016లో వర్షాలు కురిసే సమయంలో వెల్లుల్ల శివారులో లైనింగ్ పనులు చేశారు. కొంతకాలానికి వరద నీటికి పలుచోట్ల దెబ్బతింది. మే నెలలో చదును పనులు ప్రారంభించి ప్రస్తుతం సిమెంట్ లైనింగ్ నిర్మాణం చేపడుతున్నారు. ప్రాజెక్టులోకి నీరు చేరితే దిగువన కాకతీయ కాలువకు వదలాల్సి ఉంటుంది. నీరు వదిలితే పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. అధికారులు స్పందించి పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేసి చివరి ఆయకట్టుకు నీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

# ఆశ చూపి.. అందినంత దోచి



భైంసా: పోలీసులు, నిఘా వ్యవస్థను కళ్లుగప్పి కొందరు కొత్త పంథాను ఎంచుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. అపరిచితులు గ్రామాల్లో సంచరిస్తూ రెక్కీ నిర్వహించి, ద్విచక్ర వాహనాలపై ముసుగు, శిరస్త్రాణాలు ధరించి వస్తున్నారు. పథకం ప్రకారం గ్రామీణ ప్రాంతాలు, సీసీ కెమెరాలు లేని, ఉన్నా పనిచేయని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఒంటరి మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని నగదు, ఆభరణాలు ఆశ చూపి.. విలువైన ఆభరణాలు అపహరిస్తున్నారు. ఇటీవల జిల్లాలో జరుగుతున్న సంఘటనలు ప్రజలను ఆందోళన కలిగిస్తున్నాయి.

మాయమాటలతో..

రెక్కీ నిర్వహించిన దుండగులు అదునుచూసి అమాయకులకు మాయమాటలు చెప్పి బోల్తా కొట్టిస్తున్నారు. 'అమ్మా నీకు లాటరీ తగిలింది. నీ బ్యాంకు ఖాతాలో డబ్బు జమైంది. నాతో వస్తే ఇప్పిస్తాను. మా సారు పక్కనే ఉన్నారు. ఆయన్ను కలిస్తే డబ్బులు ఇస్తారు.'.. ఇటువంటి మాయమాటలతో ప్రలోభాలకు గురి చేస్తున్నారు. తీరా ఆశకు పోయి నగదు, బంగారు ఆభరణాలు పోగొట్టుకుని లబోదిబోమంటున్నారు. జిల్లాలో గత నెల నుంచి అపరిచిత వ్యక్తుల మోసాలు పెరిగిపోతున్నాయి. దుండగులు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బిహార్ ప్రాంతాలకు చెందిన వారిగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇటీవలి సంఘటనలు కొన్ని..

గత నెల 12న కుంటాల మండలం అందకూరులో ముద్దం లస్మబాయి-భోజన్న వృద్ధ దంపతుల వద్దకు వచ్చిన ఓ అపరిచితుడు మీ కొడుకు తనకు పరిచయమని, బంగారం తాకట్టు పెట్టుకుని రూ.70 వేలు ఇవ్వాలని కోరినట్లు వారిని నమ్మబలికాడు. దీంతో ఆమె తన ఒంటిపై బంగారం తీసి భర్తకు ఇచ్చి దుండగుడితో పంపింది. దారిలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి తాను ఇప్పుడే వస్తానని వృద్ధుడిని రోడ్డుపై దింపి ద్విచక్రవాహనం తీసుకుని పరారయ్యాడు.

ఈ నెల 10న కుభీరు మండల కేంద్రంలో శీల భోజవ్వ అనే మహిళ మెడలో బంగారు గొలుసు గమనించిన దుండగుడు.. అపహరించాలనే ఉద్దేశంతో ఆమె ఇంటికి వెళ్లాడు. బ్యాంకు అధికారినని మీ ఖాతాలో రూ.40వేలు జమయ్యాయని నమ్మించాడు. ఆమె దుటే రూ.35 వేలు లెక్కించి, మరో అయిదు వేలు బ్యాంకుకు వస్తే ఇస్తానని చెప్పాడు. మెడలో బంగారంతో రావద్దని చెప్పడంతో ఆమె ఇంట్లో అనారోగ్యంతో ఉన్న భర్తకు రెండు తులాల గొలుసు ఇచ్చి అతని వెంట బయలు దేరింది. కొంత దూరం వెళ్లాక ఇప్పుడే వస్తానని ఆమెను దింపి, తిరిగి ఆమె ఇంటికి వెళ్లి బంగారు గొలుసు తీసుకుని పరారయ్యాడు. దుండగుడు ఎంతకీ రాకపోవడంతో ఆమె ఇంటికి చేరుకుని విషయం తెలుసుకుని లబోదిబోమంది.

బాసర మండల కేంద్రం కోత్వాల్‌గల్లికి చెందిన రేఖకు ఈ నెల 4న ఓ అపరిచితుడు వచ్చి మీకు బంగారం, ఓ స్కూటీ లాటరీ తగిలిందని చెప్పి మీ వద్ద ఎంత బంగారం ఉందని అడిగాడు. 20గ్రాముల గొలుసు ఉందని చెప్పడంతో అది తీసుకుని నాతో రావాలని చెప్పడంతో ఆమె బంగారు గొలుసును తన మామ సాయిలుకు ఇచ్చి పంపింది. కొంత దూరం వెళ్లాక గొలుసు ఇస్తే స్కూటీ ఇస్తామని చెప్పి అడిగి తీసుకుని ద్విచక్రవాహనంపై పారిపోయాడు.

తాజాగా ఆదివారం దస్తూరాబాదు మండలం రేవోజీపేటలో అపరిచితులు సంచరిస్తూ అనాథ ఆశ్రమం పేరిట డబ్బులు వసూలు చేశారు. అనుమానం వచ్చిన స్థానికులు వారిని వివరాలు అడుగగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో.. వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారు మధ్యప్రదేశ్, మహారాష్ట్రకు చెందినట్లు భావిస్తున్నారు.

అపరిచితులను నమ్మొద్దు- కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ, భైంసా

డబ్బులు వూరికే రావు. ఆశకు పోయి మోసపోవద్దు. లాటరీలు, బహుమతులు వచ్చాయని కొందరు అపరిచితులు వచ్చి నమ్మిస్తున్నారు. కుంటాల మండలంలో జరిగిన ఇలాంటి ఒక సంఘటనలో దుండగుడిని గుర్తించాం. పోలీసులు నేరాల నియంత్రణకు నిరంతర కృషి చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమానితుల సమాచారాన్ని పోలీసులకు తెలిపి సహకరించాలి.

పనిచేయని నిఘా నేత్రాలు..

నేరాల నియంత్రణకు పోలీసులు గ్రామాల్లో వీడీసీల ద్వారా దాదాపు అన్ని గ్రామాల్లోని ప్రధాన మార్గాలు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. అనతి కాలంలోనే పనిచేయకుండా పోయాయి. వాటి నిర్వహణ బాధ్యతను విస్మరించడంతో చాలా గ్రామాల్లో నిరుపయోగంగా మారాయి. దీంతో నేరస్థులను గుర్తించడం సవాలుగా మారింది. జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ నెల 12న కుంటాల మండలం కల్లూరులో బీడీలు చుడుతున్న పెంట పెద్దమ్మ, పెంట లక్ష్మి వద్దకు వచ్చిన అపరిచితుడు మీ ఫోన్ నెట్‌వర్క్ మారినందుకు కంపెనీ నుంచి బంగారు, నగదు బహుమతి వచ్చిందని నమ్మించాడు. మీ వద్ద ఎంత బంగారం ఉంటే అంత ఇస్తామని చెప్పి తూకం వేయించాలని పెద్దమ్మను ద్విచక్రవాహనంపై తీసుకెళ్లాడు. ఆమె వద్ద బంగారం తూకం వేయించాలని తీసుకుని పరారయ్యడు. తీరా తేరుకున్న ఆమె మోసపోయానని బోరుమంది.

# రామయ్య భూములకు రక్షణ!

భద్రాచలం : దేవాదాయ శాఖ ఆస్తుల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల ఆర్డినెన్స్ తీసుకొచ్చారు. ఈ ఆర్డినెన్స్ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి మాన్యానికి రక్షణగా ఉంటుందని తెలంగాణ దేవాదాయ శాఖ భావిస్తోంది. ఇప్పటికే స్వామి వారి భూముల రక్షణకు పక్కా ప్రణాళిక అమలుచేయాలని రామాలయం అధికారులు నిర్ణయించారు. సర్వే నంబర్ల ఆధారంగా డిజిటలైజేషన్‌కు పూనుకోనున్నారు. ఈ కోవెలకు ప్రత్యేక వెబ్‌సైట్ ఉండటంతో భూముల వివరాలను ఇందులో పొందుపరిచి ఎలాంటి చిక్కులు రాకుండా చూడాలని భావిస్తున్నారు. ప్రభుత్వ గెజిట్‌లోనూ నిక్షిప్తపరచనున్నారు.

ఆలయ భూముల్లోని కట్టడాలను తొలగిస్తారా..?

భద్రాచలం రాములవారికి అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీ పరిధిలో అధిక విస్తీర్ణంలో భూమి ఉంది. అక్కడ దాదాపు 890 ఎకరాల్లో 700 ఎకరాలు ఆక్రమణకు గురైంది. మొదట్లో డ్యామేజీ ఛార్జీల కింద భూములకు రైతులు శిస్తులు చెల్లించగా ఈమధ్య మానేశారు. ఈ భూములన్నీ తమవేనన్నది అక్కడి వారి వాదన. ఈక్రమంలో పదుల సంఖ్యలో నూతన శాశ్వత కట్టడాలు ఏర్పడ్డాయి. దీనిపై అంతర్రాష్ట్ర స్థాయి ఉద్యమాలు సాగాయి. రామాలయానికి అనుకూలంగా ఏపీ హైకోర్టు తీర్పునిచ్చింది. పురుషోత్తపట్నం వాసులు సైతం పోరాటం సాగిస్తున్నారు. గతంలో పనిచేసిన ఈఓలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెద్దలను కలిసి సమస్యను వివరించారు. ఈఓగా రమాదేవి బాధ్యతలు స్వీకరించాక భూముల అంశానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఇంతకుముందు ఒకసారి ఏపీ దేవాదాయ శాఖ మంత్రి సత్యనారాయణకు ఈ అంశంపై విన్నవించారు. తాజాగా మూడు రోజుల క్రితం మరోదఫా కలిసి అన్ని వివరాలను అందించి సహకరించాలని కోరారు. పురుషోత్తపట్నం



లో ఇటీవల నిర్మించిన భవనాలను తొలగిస్తారా లేదా అన్న చర్చ సాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో భద్రాద్రి రామాలయానికి చెందిన భూములు 1,347.27 ఎకరాలుండగా 1,087.34 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు సమాచారం.

అభివృద్ధి పనులపై దృష్టి సారించరూ..

యాదాద్రి, వేములవాడ ఆలయాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో ప్రత్యేక అథారిటీలను ఏర్పాటు చేశారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయాభివృద్ధికి రూ.వందల కోట్లతో బృహత్తర ప్రణాళిక రూపొందించటంతో అక్కడా అథారిటీని ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. ప్రభుత్వం నిధులివ్వకపోతే ధర్మకర్తల మండళ్లు చొరవ చూపి ఆయా ఆలయాలను తీర్చిదిద్దుతున్నాయి. భద్రాచలంలో దశాబ్దం నుంచి ధర్మకర్తలు లేరు. ముఖ్యమంత్రి కేసీఆర్ రెండు పర్యాయాలు ఇక్కడికి వచ్చి రూ.150 కోట్లు ప్రకటించినా ఈ నిధులను రాబట్టేందుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపటం లేదనే వాదనలు వ్యక్తమవుతు న్నాయి. అంజన్నకు ఆరాధ్య దైవమైన రామయ్యపై దేవాదాయ శాఖ దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

# వృత్తివిద్య.. భవితకు నిచ్చెన

చేగుంట: విద్యార్థులను చిన్నతనం నుంచి ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి ఆస్కారం ఉంటుంది. చదువు ఒక్కటే కాకుండా వివిధ రంగాల్లో ప్రావీణ్యం సంపాదిస్తే వారికి అన్ని రకాలుగా ఉపయోగపడుతుంది. విద్యాలయాల్లో చదువు నేర్పిస్తూ ఆటల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ తరుణంలో వృత్తివిద్య కోర్సుల అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు త్వరగా స్థిరపడేలా తీర్చిదిద్దేందుకు ఇవి ఉపయోగపడనున్నాయి. కేంద్రం ఈ విద్యాసంవత్సరంలో శ్రీకారం చుట్టనున్న ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకంలో భాగంగా ఈ దిశగా అడుగులు పడనున్నాయి. కోర్సుల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది.

ప్రతిపాదనలు పంపించి..

వృత్తి విద్యా కోర్సుల అమలుకు రాష్ట్రంలో 241 బడులను ఎంపిక చేయనున్నారు. వీటిలో జిల్లాలో ఎనిమిదింటికి సంబంధించి ప్రతిపాదనలు పంపించారు. మక్తభూపతిపూర్ (మెదక్), శివ్వంపేట, చందాయిపేట (చేగుంట), బూర్గుపల్లి (హవేలి ఘనపూర్), కాళ్లకల్ (మనోహరాబాద్), నిజాంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలు, జిల్లా కేంద్రం మెదక్‌లోని రెండు రెసిడెన్షియల్ పాఠశాలల్లో అమలు చేయడానికి ఉన్నతాధికారులకు నివేదించారు. జిల్లా వ్యాప్తంగా 148 జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు పలు చోట్ల గురుకులాలు ఉన్నాయి. అన్ని రకాల వసతులు, ఉపాధ్యాయులు, వివిధ కారణాలతో ఇప్పటికి ఈ 8 బడులను ఎంపిక చేశారు. గతంలో పది పాఠశాలల్లో వృత్తివిద్యా కోర్సులను ప్రవేశపెట్టగా విజయవంతంగా కొనసాగుతున్నాయి.

రెండు దశల్లో శిక్షణ

ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో రెండు దశల్లో శిక్షణ ఇవ్వనున్నారు. తొమ్మిదో తరగతి వారిని తొలి దశలో వారికిష్టమైన కోర్సుల్లో చేరేలా, అందులోని అంశాలు తెలియజేసి సంసిద్ధులను చేస్తారు. రెండో దశలో శిక్షణతో పాటు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారు. పది వార్షిక పరీక్షలు ముగిసేలోపు నేర్చుకున్న వాటిలో విద్యార్థులు పరిణతి సాధించేలా తీర్చిదిద్దుతారు. ఇంటర్ వరకున్న గురుకులాల్లో రెండో దశలో మరి కొంతకాలం వృత్తివిద్య కొనసాగిస్తారు.

ఆదర్శ పాఠశాలల్లో..ఇప్పటికే జిల్లాలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలల్లో వృత్తివిద్యా కోర్సులను అమలు చేస్తున్నారు. చేగుంట, రామాయంపేట, చిన్నశంకరంపేట, టేక్మాల్, నర్సాపూర్, రేగోడ్, పెద్దశంకరంపేటలోని ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. మరోవైపు కస్తూర్బాలలో సైతం విద్యార్థినులకు కుట్టు, అల్లికలు, చిత్రాలు గీయడం తదితర వాటిని నేర్పిస్తున్నారు.

పలు రకాల కోర్సులు

డిమాండ్ ఉన్న 19 రకాల వృత్తివిద్యా కోర్సుల్లో స్థానికంగా డిమాండ్ ఉన్న వాటిని ప్రవేశపెట్టనున్నారు. ఒక్కో పాఠశాలలో రెండు కోర్సులు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు ఆసక్తి ఉన్న వాటిని ఎంపిక చేసుకోవచ్చు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రెండింటిని ఎంపిక చేసుకొని సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా అదనపు సమయంలో తర్ఫీదు ఇస్తారు. ప్రయోగాలు చేయిస్తారు. వ్యవసాయానికి సంబంధించిన కోర్సుల్లో క్షేత్ర సందర్శనకు సైతం తీసుకెళ్తారు. దున్నడం, నాట్లు వంటివి నేర్పిస్తారు. పదో తరగతి తర్వాత ఆర్థిక ఇబ్బందులతో చదువు మానేసే వారికి ఉపాధి పొందేందుకు ఇవి దోహదం చేస్తాయి. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను కేంద్రం త్వరలోనే ప్రకటించనుంది.

# ఆరోగ్యశాఖకు డబ్బుజబ్బు..

మంచిర్యాల : డబ్బు ఆశ చూపిస్తే .. ఆరోగ్యశాఖలో కిందిస్థాయినుంచి ఉన్నతాధికారి వరకు నిబంధనలకు విరుద్ధంగా ఏ పనిచేసేందుకైనా సిద్ధంగా ఉంటారని అనేకసార్లు నిరూపితమైంది. వైద్యారోగ్యశాఖలోని మూడు విభాగాల్లో(డీఎంఈ, టీవీవీపీ, డీహెచ్)నూ ఇదే తంతు. ఆయా కార్యాలయాల్లో పనిచేసే చాలామంది ఇతర ప్రాంతాల్లో ఉంటూ వారంలో రెండు, మూడురోజులు హాజరవుతారు. అడిగితే ఉన్నతాధికారుల చేతులు తడుపుతారు. వీరుసైతం ఇదే తీరుగా చేస్తుండటంతో ఒకరికొకరు సర్దుకుపోతుంటారు. కార్యకలాపాలు వాయిదా వేస్తూ బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తుంటారు.

పట్టిపీడిస్తున్నారు..ఆరోగ్యశాఖలో అద్దె ప్రాతిపదికన వాహనాల కేటాయింపు దగ్గర నుంచి బిల్లుల చెల్లింపు వరకు లంచం ఇవ్వకుంటే యజమానుల పనులు కావడం లేదు. ఉద్యోగ ప్రకటనల అనంతరం ఎంపికైన అభ్యర్థుల నుంచి డబ్బులు తీసుకుంటున్నారు. లేదంటే సరైన పత్రాలు సమర్పించలేదంటూ పక్కన పెడుతున్నారు. గతంలో వైద్యకళాశాలకు సంబంధించిన నియామకాల్లో జీజీహెచ్‌లోని ఓ ఉద్యోగి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు రావడంతో పాలనాధికారి ప్రక్రియ నిలిపివేసి చివరకు ఓ ఏజెన్సీకి అప్పగించారు. ఇలాంటి ఉదాహరణలు ప్రస్తుత డీఎంఈ, డీహెచ్ జిల్లా కార్యాలయాల్లో అనేకం ఉన్నాయి. బాధితులు ముందుకురావడంతోపాటు ఏసీబీ నిఘా పెడితే మరింత మంది బయటపడే అవకాశముంది.

నిర్మల్‌లో రూ. 8 వేలు లంచం తీసుకుంటూ..

ఆరోగ్యశాఖ అధికారులు విశ్రాంత ఉద్యోగులను సైతం వదలడం లేదు. గతేడాది నిర్మల్ జిల్లాలో తెలంగాణ వైద్య విధాన పరిషత్‌కు చెందిన ఓ ఉద్యోగి.. మెడికల్ రియంబర్స్‌మెంట్ మంజూరుకు డబ్బులు డిమాండ్ చేశారు. బాధిత వ్యక్తి ఏసీబీని సంప్రదించారు. చివరకు రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుపడ్డారు.

నిధుల దుర్వినియోగంపై..

ఆరోగ్యశాఖ అధికారులు.. ఇతరుల దగ్గర నుంచి లంచం తీసుకోవడమే కాకుండా శాఖ నిధులు దుర్వినియోగం చేయడంలోనూ ముందుంటున్నారు. గతంలో మంచిర్యాల జిల్లా శాఖకు చెందిన ఓ ఇద్దరు అధికారులు.. ఆరోగ్య సిబ్బందికి ఇచ్చే శిక్షణలో భాగంగా భోజన ఖర్చులు చూపెట్టి సుమారు రూ.లక్షన్నర స్వాహా చేశారు. కానీ ఈ ఘటనలో బలైంది ఓ స్టాఫ్‌నర్సు అని ఇటీవలే తేలింది. సొమ్మును హోటల్ నిర్వాహకుల నుంచి ఆమె ఖాతాలో జమ చేయించి నగదు రూపంలో తీసుకోగా చివరకు ఆమె మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఈనెల మొదటి వారంలో ఆ ఉద్యోగిని సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు కూడా వచ్చాయి.

రూ.10 వేలకు ముగ్గురి పోటీ.. ఏసీబీకి చిక్కి..

నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన బిల్లుల్లోనూ అవినీతికి పాల్పడుతున్నారు. డబ్బుకోసం ఒత్తిడి తెస్తూ చివరకు ఏసీబీకి చిక్కుతున్నారు. ఇటీవల మంచిర్యాల వైద్యారోగ్యశాఖలో రూ.10 వేలకు కక్కుర్తితో ముగ్గురు పోటీపడి బలయ్యారు. ఇందులో ఇద్దరు పొరుగుసేవల ద్వారా విధులు నిర్వహిస్తుండగా మరొకరు శాశ్వత ఉద్యోగి.

అవినీతిమయంగా జిల్లా వైద్యారోగ్యశాఖ..

జిల్లా కార్యాలయంలోని శాశ్వత ఉద్యోగులతో పాటు ఎన్‌హెచ్‌ఎం కింద పనిచేస్తున్న సిబ్బందిలో చాలామంది అవినీతిపరులనే ఆరోపణలు వస్తున్నాయి. కిందిస్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు లంచాలకు కక్కుర్తి పడుతున్నారని శాఖలోని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు. పనికోసం వస్తే శాఖకు సంబంధించిన ఉద్యోగిని సైతం వదలలేదంటున్నారు. వేతనాల చెల్లింపులు, శాఖాపరమైన ఖర్చులు ఇచ్చేందుకు సైతం ఇక్కడి సిబ్బంది చేతులు చాస్తున్నారు. ఇటీవల ఏసీబీకి పట్టుబడ్డ ముగ్గురితోపాటు మరో ఇద్దరిది నిత్యం ఇదే పని అంటూ లావాదేవి విషయంలో అనేకసార్లు కార్యాలయంలోనే గొడవపడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా జిల్లా అధికారి పట్టించుకోకపోవడం, పర్యవేక్షణ అంతంత మాత్రమే చేస్తుండటంతో ఆయా వ్యక్తులను ప్రోత్సహిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## చిరిగిన సంచి.. తూకం పేచీ

మంచిర్యాల : పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంపిణీ చేసే రాయితీ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఇప్పటికే చౌకధరల దుకాణాల వద్దనే దళారులు లబ్ధిదారుల నుంచి నేరుగా కొని మహారాష్ట్రకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా నాసిరకం గోనె సంచులు వాడటంతో అవి చిరిగి సగం బియ్యం నేలపాలవుతున్నాయి. ఆ చిరిగిన సంచులను తూకం వేయకుండానే డీలర్లకు సరఫరా చేస్తున్నారు. ఒక్కో బస్తాకు ఒకటి నుంచి అయిదు కిలోల వరకు బియ్యం తగ్గుతుందని డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.జిల్లాలో ఆరు మండల గిడ్డంగులు ఉన్నాయి. వీటిలో డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులను ఇన్‌ఛార్జిగా నియమించాల్సి ఉంది. నస్పూరులోని మంచిర్యాల గిడ్డంగిలో ఎనిమిది నెలలుగా ఇన్‌ఛార్జి పోస్టు ఖాళీగా ఉండటంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగితో కొనసాగిస్తున్నారు. ఆ గోదాంలో ఇప్పుడే విద్యుత్తు వైరింగ్ చేస్తున్నారు. కరెంటు లేక తూకం వేసే కాంటా నిరుపయోగంగా ఉంది. తూకం వేయకుండాఐ సంచుల్లో సరఫరా చేయడంతో డీలర్లు నష్టపోతున్నారు. చర్యలేవి?నస్పూరులోని మండల గిడ్డంగి నుంచి మంచిర్యాల, మందమర్రి, జైపూర్, హాజీపూర్, నస్పూరు మండలాల్లోని చౌకధరల దుకాణాలకు రాయితీ బియ్యం సరఫరా చేస్తారు. ఈ గిడ్డంగి ద్వారా నెలకు దాదాపు 1,260 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రతి నెలా 20 నుంచి మరుసటి నెల 5వ తేదీలోపు లారీల ద్వారా రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 5 కిలోలు, రాష్ట్రం ఇచ్చే ఒక కిలో బియ్యం కలిపి మొత్తం ఆరు కిలోలు ఉచితంగా ఒక్కో లబ్ధిదారునికి పంపిణీ చేస్తున్నారు. ప్రధాన గిడ్డంగుల నుంచి బియ్యం ఆలస్యంగా వచ్చినప్పుడు, వాటిని రేషన్ దుకాణాలకు తరలించడానికి అవసరమైన లారీల కొరతతో అప్పుడప్పుడు పంపిణీలో జాప్యమవుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బియ్యం తీసుకున్న లబ్ధిదారులు, కొన్ని దుకాణాల్లో అక్కడే సిద్ధంగా ఉన్న దళారులకు కిలోకు రూ.15 చొప్పున అమ్ముతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు మామూళ్లు తీసుకుని వదిలేస్తున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

ఎస్‌డబ్ల్యూసీ (స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్) గోదాం నుంచి వచ్చిన బియ్యం బస్తాలను నిబంధనల ప్రకారం.. ముందుగా నస్పూరులోని మండల గిడ్డంగిలో తూకం వేసి భద్రపర్చాలి. ఆ తర్వాత మళ్లీ రేషన్ దుకాణాలకు తూకం వేసి పంపించాలి. ఇందుకోసం ఒక క్వింటాలుకు రూ.26 చొప్పున హమాలీ ఛార్జీ చెల్లిస్తారు. నస్పూరులో ప్రధాన గోదాం నుంచి వచ్చిన బియ్యం తూకం వేయకుండానే ఆ లారీలో నుంచి నేరుగా మరోదానిలో లోడింగ్ చేసి ఒకేసారి రెండు మూడు రేషన్ దుకాణాలకు పంపిస్తున్నారు. తూకం వేయకుండానే చిరిగిన సంచుల్లో బియ్యం సరఫరా చేయడంతో డీలర్లకు నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది.

రేషన్ దుకాణాలకు సరఫరా చేయడానికి నస్పూరులోని మండల గిడ్డంగిలో నిలువ ఉంచిన బియ్యం బస్తాలివి. కొన్ని చిరిగినవి ఉండటంతో మధ్య మధ్యలో ఇలా బియ్యం పడిపోతున్నాయి. బస్తాలు మళ్లీ లోడింగ్ అన్‌లోడింగ్ చేసేటప్పుడు మరింత చినిగి నేలపాలవుతున్నాయి.గతేడాది పాత మంచిర్యాలలో మండల గిడ్డంగి ఏర్పాటు చేసినప్పుడు దాదాపు 600 టన్నుల రేషన్ బియ్యాన్ని, అందులో పనిచేసే ఇన్‌ఛార్జి గోల్‌మాల్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు గుర్తించారు. ఆ గోదాం ఇన్‌ఛార్జిని సస్పెండ్ చేశారు. గోదాంలో తగ్గిన బియ్యంపై ఇప్పటి వరకు పౌర సరఫరాల శాఖ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి మిగతా బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

# బినామీలే అధికం

జగిత్యాల : రోడ్డు పక్కన చిన్నాచితకా వ్యాపారాలతో వీధివ్యాపారులు ఏళ్లుగా అవస్థలు పడుతున్నారు. మరోవైపు వీరి కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు సైతం పెరగడంతో వీధివ్యాపారులకు శాశ్వత షెడ్ల సౌకర్యం కల్పించాలని పురపాలక శాఖ భావించింది. ఇందుకు సౌలభ్యంగా ఉన్న రహదారుల్లో బల్దియా రెండేళ్ల క్రితం షెడ్ల నిర్మాణం చేపట్టింది. పట్టణంలో గొల్లపల్లిరోడ్డు వైపు 37 దుకాణాలు, శ్రీరామా థియేటర్ ఎదుట 9, అంగడిబజార్‌లో 20 షెడ్లను రూ.45 లక్షలతో నిర్మిస్తోంది. ఒక్కో పనిని రూ.15 లక్షల చొప్పున విభజించి గుత్తేదార్లకు అప్పగించారు. గొల్లపల్లి రోడ్డువైపు షెడ్లకు ఏడాదిన్నరపైనే పట్టింది. రామా థియేటర్, అంగడిబజార్‌లో ఇంకా పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణంలో తీవ్రమైన జాప్యంతో పాటు నాణ్యత లోపించిందని వీధివ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకేంద్రంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ చేపట్టిన సర్వేలో మొత్తం 6207 వీధి వ్యాపారులున్నారు. ఇందులో ప్రధానంగా ఏళ్ల తరబడి ఒకేచోట రహదారులపై చిరువ్యాపారులు చేసేవారు 300పైనే ఉంటారు. నిర్మించిన షెడ్లు 100 లోపే ఉన్నాయి. గొల్లపల్లిరోడ్డులో గతంలో ఉన్నవారికే ప్రాధాన్యతనిచ్చి కేటాయింపులు చేపడతామన్న అధికారులు గుట్టుచప్పుడు కాకుండా 29 షెడ్లను అప్పజెప్పారు. మిగిలినవాటిని సైతం అక్రమ పద్ధతిలో కేటాయించే ందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మంజూరు చేసిన షెడ్లలో యజమానులు నిర్వహించకుండా వాటిని కొందరు నిబంధనలకు



విరుద్ధంగా అద్దెకు ఇస్తున్నారు. వీటిపై పురపాలక, మెప్మా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టడంలేదు. దీంతో అర్హులకు అందాల్సిన షెడ్లు ఆరంభంలోనే ఇతరులకు చిక్కడంతో మిగిలినవాటిపై కూడా దళారులు కన్నేశారు. షెడ్ల కేటాయింపులో ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు అధికారులతో కుమ్మక్కై అర్హులకు మొండిచేయి చూపారు.

రోడ్డుపైనే అమ్మకాలు

జిల్లాకేంద్రంలో అవసరం మేరకు షెడ్ల నిర్మాణానికి స్థలమున్నప్పటికీ కేవలం కొన్నిచోట్లనే నిర్మించారు. గుర్తింపుకార్డు కలిగిన వీధివ్యాపారులు వందల సంఖ్యలో రోడ్లపైనే నిత్యం ఎండకు, వానకు తామున్నచోటనే కష్టాలు అనుభవిస్తున్నారు. యావర్‌రోడ్డులో కేవలం గద్దెలు నిర్మించి వదిలేశారు. పార్కు వద్ద సౌకర్యంగా ఉన్నా ఇక్కడ షెడ్లు నిర్మించలేదు. పాతబస్టాండు కూడలి, జంబిగద్దె, యావర్‌రోడ్డు, కొత్తబస్టాండు కూడలి తదితర ప్రాంతాల్లో నిత్యం వీధివ్యాపారులు తమ ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. ఇలాంటివారికి మెప్మా, పురపాలక సంఘం అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి భరోసా కల్పించలేకపోయారు. కనీసం షెడ్లకు సంబంధించి పూర్తి అవగాహన సైతం వీధి వ్యాపారులకు కల్పించలేకపోయారు. కనీసం త్వరలో కేటాయించనున్న షెడ్లనైనా గుర్తింపుకార్డు కలిగిన అర్హులకు కేటాయించాలని వీధివ్యాపారులు కోరుతున్నారు.

అక్రమాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు

శ్రీనివాస్, మెప్మా అధికారి

పట్టణంలో షెడ్ల కేటాయింపులో అర్హులకే అవకాశం కల్పించాం. యజమానులు కాకుండా ఇతరులు షెడ్లలో ఉండేందుకు అవకాశం లేదు. ఎవరైనా ఉంటే మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. త్వరలోనే అన్ని షెడ్లను నిబంధనల మేరకు కేటాయిస్తాం.

# వరంగల్ రహదారికి మహర్దశ

కరీంనగర్ : ఎన్నో ఏళ్ల కల నెరవేరనుంది. కరీంనగర్–వరంగల్ రహదారికి మహర్దశ రానుంది. 563వ నంబరు జాతీయ రహదారి నాలుగు వరుసలుగా మార్చే పనులు ప్రారంభించేందుకు ఈనెల 8న ప్రధాని నరేంద్రమోదీ వరంగల్‌కు వస్తున్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ అధికారులతోపాటు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిసి వినతులు అందించారు. ఆరు నెలల కిందట కేంద్ర ప్రభుత్వం ఈ రోడ్డు కోసం రూ.2,146 కోట్లు విడుదల చేసింది. అప్పటినుంచి భూసేకరణ ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. దాదాపు 60 శాతానికిపైగా ప్రక్రియ పూర్తికాగా సంబంధిత భూనిర్వాసితులకు రైతులకు పరిహారం అందుతోంది.

ప్రమాదాలకు అడ్డుకట్ట..

కరీంనగర్–వరంగల్ రహదారికి అధిక ప్రమాదాలు జరిగే మార్గంగా పేరొందింది. నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతుంటాయి. ఎందరో ప్రాణాలు కోల్పోగా.. చాలామంది క్షతగాత్రులయ్యారు. అధిక మూలమలుపులు ఉన్న రోడ్డు ఇది. ప్రమాదాల నివారణకు పోలీసులు, రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నా అడ్డుకట్ట పడలేదు. రోడ్డు వెడల్పు చిన్నగా ఉండటం వేలాది వాహనాలు రాకపోకలను సాగిస్తుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సగటున నెలకు 40కిపైగా ప్రమాదాలు జరిగే ఈ మార్గాన్ని విస్తరించాలనే ప్రతిపాదనకు సర్కారు ఆమోదించింది. కరీంనగర్, హనుమకొండ జిల్లాల పరిధిలోని 30 గ్రామాలకు ఈ దారి విస్తరణతో మేలు జరగనుంది. కరీంనగర్ జిల్లా పరిధిలో 46.24 కి.మీ, హనుమకొండ జిల్లా పరిధిలో 21.77 కి.మీ కొత్త నిర్మాణాన్ని చేపట్టనున్నారు. పాత రోడ్డు 66.79 హెక్టార్లలో ఉండగా కొత్తగా 258.33 హెక్టార్లు సేకరిస్తున్నారు. మొత్తం నాలుగు వరుసల రహదారికి ఏకంగా 325.12 హెక్టార్ల భూమిని వినియోగించనున్నారు.

ఐదు బాహ్య వలయదారులు..

మానకొండూర్, తాడికల్, హుజూరాబాద్, ఎల్కతుర్తి, హసన్‌పర్తి సమీపంలో ఐదు బైపాస్‌లు నిర్మించనున్నారు. మొత్తం రోడ్డులో దాదాపు 45 కి.మీ మేర ఈ బాహ్యవలయ రహదారి ఏర్పాటుకానుంది. ఈ మార్గాన్ని 45 నుంచి 60 మీటర్ల వెడల్పుతో నిర్మించబోతున్నారు. ఈ మార్గం వెంబడి అధునాతన వసతులు కల్పించనున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలు రోడ్డు పక్కన నిలిపేందుకు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మార్గాన్ని తొందరగా పూర్తి చేస్తే ప్రయాణం మరింత సులభతరమవుతుంది. రెండు చోట్ల ఆర్వోబీ (రోడ్డు ఓవర్ బ్రిడ్జి), ఆర్‌యూబీ (రోడ్డు అండర్ బ్రిడ్జి)లు నిర్మించనున్నారు. కల్వర్టులు చిన్నపాటి వంతెనలు పలు చోట్ల ఏర్పాటు చేయబోతున్నారు. ఏడాదిన్నర వ్యవధిలో ఈ రోడ్డును పూర్తి చేసేలా కసరత్తు చేస్తున్నారు.

# పూర్తిగా పుర ఖాతాలోకే..



కొత్తగూడెం : మున్సిపాలిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. పురపాలికల్లో లలేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్) కింద జమయ్యే డబ్బులను నేరుగా వాటికే కేటాయిం చనుంది. ఇందుకోసం బ్యాంకు ఖాతా తెరవాలని ఆదేశాలు రావడంతో అన్నిచోట్ల అధికారులు ఆదిశగా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే దరఖాస్తులకు సంబంధించిన డబ్బులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇక నుంచి ఎల్ఆర్ఎస్ కింద చెల్లించే రుసుములు సైతం సదరు బ్యాంకు ఖాతాలో జమకానున్నాయి. వీటిని పురపాలికల అభివృద్ధి పనులకు వెచ్చించనున్నారు. గతంలో ఇలా..మున్సిపాలిటీల్లో అక్రమ లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2020లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ఒక నగరపాలిక, ఏడు పురపాలికలు ఉండగా మణుగూరు మినహా మిగతాచోట్ల దరఖాస్తులు వచ్చాయి. వ్యక్తిగతంగా ఒక ప్లాటు దరఖాస్తుకు రూ.1,000, లేఅవుట్ ఉంటే అన్ని ప్లాట్లకు కలిపి రూ.10వేలను చలానా రూపంలో సంబంధిత వ్యక్తులు చెల్లించారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు/నగరపాలికల్లోని దరఖాస్తు రుసుములు హైదరాబాద్‌లోని ప్రత్యేక (పూలింగ్ అకౌంట్)లో జమయ్యాయి. క్రమబద్ధీకరణకు వసూలు చేసిన రుసుము సైతం ఆ ఖాతాలోనే జమవడంతో అవీ ప్రభుత్వానికే చెందుతాయని భావించారు. పురపాలికల అభివృద్ధికి వాటిని విడుదల చేస్తారో లేదో అనే అనుమానం ఉండేది. తాజాగా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎల్ఆర్ఎస్ నిధులు స్థానికంగా ఖర్చు చేసేందుకు అవకాశం లభించింది.

మార్కెట్ ధరల ఆధారంగానే..

ప్లాట్ల క్రమబద్ధీకరణకు 2020లో ఉన్న మార్కెట్ ధరల మేరకు రుసుములు వసూలు చేయనున్నారు. ఒక్కో ప్లాటుకు అక్కడి మార్కెట్ ధరను బట్టి సుమారుగా రూ.20వేల నుంచి రూ.30వేల వరకు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన పురపాలికలకు భారీగానే ఆదాయం సమకూరుతుందని అధికారులు చెబుతున్నారు. దరఖాస్తుల రూపేణా తక్కువ మొత్తంలో నిధులు సమకూరినా ప్లాట్ల క్రమబద్ధీకరణ ద్వారా పురపాలికలకు రూ.కోట్లలో ఆదాయం రానుంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్ఆర్ఎస్ డబ్బులను జమచేయడానికి ప్రత్యేక ఖాతా తెరిచాం. పాల్వంచ మున్సిపాలిటీ ఖాతాలో ఇప్పటివరకు రూ.12లక్షలు జమయ్యాయి. వాటిని రహదారులు, మురుగుకాల్వల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పనకు వినియోగిస్తున్నాం. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు మరింత అభివృద్ధి చెందనున్నాయి. ఎ.స్వామి, మున్సిపల్ కమిషనర్, పాల్వంచ

# కమీషన్ల పూత.. నిధుల మేత



నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లాలో చెక్‌డ్యాంల నిర్మాణాల్లో భారీగా అవినీతి చోటు చేసుకుంటోంది. కలకాలం ఉండాల్సిన నిర్మాణాలు చిన్నపాటి వర్షానికి నిర్మాణం పూర్తి కాకముందే కుప్పకూలుతున్నాయి. పర్యవేక్షణ లోపం, పర్సంటేజీలతో సంబంధిత అధికారులు నిర్మాణాల్లో జోక్యం చేసుకోకపోవడంతో గుత్తేదారులు ఆడింది ఆటగా సాగుతోంది. మోత్కూరు మండలం సుదర్శాపురంలో నిర్మాణం పూర్తి కాకముందే చెక్‌డ్యాం రక్షణగోడ, కింది భాగం కూలడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మొత్తం 12 నియోజకవర్గాల్లో 74 చెక్ డ్యాంలకు గాను ప్రభుత్వం రూ.393.91 కోట్లు రెండేళ్ల క్రితం మంజూరు చేసింది. 2021 ముగిసే నాటికే 27 చెక్‌డ్యాంలు పూర్తి కావాల్సి ఉండగా..2023 ఆగస్టు నాటికి 23 మాత్రమే పూర్తయినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. ఈ రెండేళ్లలో రూ.100 కోట్లతో మరో 36 చెక్‌డ్యాంలను ప్రభుత్వం మంజూరు చేసింది. అవన్నీ ఇప్పుడిప్పుడే పనులు ప్రారంభమవుతున్నాయి. కొత్తగా మంజూరైన చెక్‌డ్యాంలకు సంబంధించి ఇప్పటికే ఎవరి వాటా వారు పంచేసుకున్నట్లు సంబంధిత శాఖకు చెందిన ఓ అధికారే వెల్లడించడం గమనార్హం.

పప్పు బెల్లం తీరున నిధుల దుర్వినియోగం..

చెక్‌డ్యాంల నిర్మాణాల పేరుతో ప్రభుత్వ ధనాన్ని ప్రజాప్రతినిధులు, గుత్తేదారులు, అధికారులు పప్పుబెల్లాల్ల పంచుకుతింటున్నారన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు సంబంధించి 19 చెక్‌డ్యాంలను రూ.105 కోట్లతో చేపట్టగా..వీటన్నింటినీ ఒకే గుత్తేదారుకు అప్పగించారు. మిగిలిన ప్రాంతాల్లో పనులను అంచనా వ్యయం కంటే 4 నుంచి 5 శాతం తక్కువకు చేస్తుండగా..ఈ మూడు నియోజకవర్గాల్లో మాత్రం 4.6 శాతం ఎక్కువకు గుత్తేదారు పనులు చేపట్టినట్లు సమాచారం. ఆయన మరో ఇద్దరికి సబ్ కాంట్రాక్ట్‌లకు ఇవ్వగా.. వాటిలో నాణ్యత లేకపోవడంతో పగుళ్లు ఏర్పడుతున్నాయి.

దేవరకొండ నియోజకవర్గంలో 17 శాతం కమీషన్‌పై సదరు గుత్తేదారు స్థానిక నాయకులకు కాకుండా ఎవరికో సబ్ కాంట్రాక్ట్ ఇవ్వడంతో.. ఏడాది క్రితం అక్కడి స్థానిక నేతలు ప్రజాప్రతినిధిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.105 కోట్ల పనులు ఒక్కరే దక్కించుకున్న వ్యవహారంలో సదరు ప్రజాప్రతినిధికి రెండు కోట్ల చొప్పున కమీషన్ ఇచ్చినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. మరోవైపు అధికారులు సైతం మామూళ్ల మత్తుకు అలవాటుపడి చెక్‌డ్యాంల గుత్తేదారుల నుంచి ముందే కమీషన్ తీసుకొని నాణ్యతను పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

సాగర్ నియోజకవర్గంలోని మొత్తం 10 చెక్‌డ్యాంల నిర్మాణం స్థానిక ప్రజాప్రతినిధికి 7 శాతం కమీషన్‌తో ఆయన తరఫు బంధువులకు చెందిన కంపెనీ ఉప గుత్తేదారులుగా పనులు చేస్తున్నట్లు తెలిసింది. టెండర్ల ప్రక్రియకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులుండగా, కొందరు ప్రజాప్రతినిధుల అండతో సిండికెట్‌గా మారి ఉమ్మడి జిల్లాలోని మెజార్టీ పనులను ఒకే కంపెనీ దక్కించుకుంది.

అవినీతికి చిరునామాగా ఆ అధికారి

జలవనరుల శాఖలో పనిచేస్తున్న ఓ అధికారి అవినీతికి చిరునామాగా మారారని సొంత శాఖలోని ఉద్యోగుల నుంచే వినిపిస్తున్న మాట. చెక్‌డ్యాంలతో పాటూ శాఖలో చేసే ప్రతి పనిపై 20 శాతం కమీషన్ తీసుకుంటున్నాడని విశ్వసనీయంగా తెలిసింది. ఆయనకు డబ్బులు చెల్లిస్తే పనులు పూర్తి కాకుండానే బిల్లులు చేస్తారన్న వాదన ఉంది. దేవరకొండ నియోజకవర్గంలో రెండు చెక్‌డ్యాంల నిర్మాణాలు 80 శాతం మేర పూర్తికాగా...ఇప్పటికే వాటికి సంబంధించిన డబ్బులు సదరు గుత్తేదారు ఖాతాకు బదిలీ అయినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.

నాణ్యతలో రాజీపడం: సీఈ అజయ్‌కుమార్2021లో మంజూరైన చెక్‌డ్యాంలన్నీ తుది దశకు చేరుకున్నాయి.నాణ్యత విషయంలో రాజీపడం. క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం. దేవరకొండలో ఒక చెక్‌డ్యాం నిర్మాణంలో జాప్యం జరిగింది. ఇందుకు సంబంధించి గుత్తేదారుకు నోటీసు ఇచ్చాం.

# ఆకర్షణీయ మొక్కలు.. అందంగా కార్యాలయాలు

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని జిల్లా సమీకృత సముదాయం, ఎస్పీ కార్యాలయాలు ప్రారంభించేందుకు తేదీ ఖరారు కావడంతో పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. ఇప్పటికే పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. కలెక్టరేట్ పనులు పూర్తయ్యాయి. చిన్న పనులు ఉండగా వాటిని కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీ కార్యాలయంలో విద్యుత్తు నియంత్రిక, బీటీ రహదారుల పనులు సాగుతున్నాయి. వీటిని కూడా మరో నాలుగు రోజుల్లో పూర్తి చేయనున్నారు. విశాలమైన రహదారులకు ఇరువైపులా వందల సంఖ్యలో మొక్కలు నాటించారు. విద్యుత్తు బిల్లును తగ్గించే క్రమంలో భాగంగా రాష్ట్రంలో తొలిసారిగా కలెక్టరేట్‌లో 100 కేవీ సామర్థ్యం గల సౌర విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు చేయించారు.

పచ్చదనానికి ప్రాధాన్యం

కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల సముదాయాల్లో పచ్చదనానికి ప్రాధాన్యం



ఇచ్చారు. ఇతర ప్రదేశాల నుంచి తెప్పించి సముదాయాల్లో, బయట గార్డెన్ చుట్టూ వీటిని నాటించారు. సేద తీరేందుకు ఏపుగా పెరిగే మొక్కల దగ్గర నుంచి పూలు, అందంగా కనిపించేందుకు వివిధ ఆకృతుల్లో మొక్కలు నాటించారు. రెండు కార్యాలయాల్లో సుమారు 50 రకాల వరకు మొక్కలు నాటించడం గమనార్హం. ఈ నెల 20న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించేందుకు వస్తుండటంతో పనులు పూర్తి చేసేందుకు అధికారులు ముమ్మరంగా చర్యలు తీసుకుంటున్నారు.

# పాలేరుకు జేఎన్‌టీయూ

ఖమ్మం : ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల కొలువుదీరనుంది. దీనికి 'జేఎన్‌టీయూ–పాలేరు'గా ప్రభుత్వం నామకరణం చేసింది. ఈమేరకు ఉత్తర్వులను వెలువరించింది. ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల నెలకొల్పాలని ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఖమ్మం జిల్లా వాసుల కల ఎట్టకేలకు నెరవేరింది.

ఈ ఏడాది నుంచే తరగతులు

ఈ విద్యాసంవత్సరం నుంచే విద్యార్థులకు కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పించి తరగతులు నిర్వహిస్తారు. ఇప్పటికే మూడు విడతల కౌన్సెలింగ్ పూర్తయ్యింది. ఈనెల 17 నుంచి 19 వరకు ప్రత్యేక కౌన్సెలింగ్ జరగనుంది. దీనిద్వారా ఎంపిక చేస్తారా లేదా మరో కౌన్సెలింగ్ నిర్వహిస్తారా అనే విషయంపై ఒకట్రెండు రోజుల్లో స్పష్టత రానుంది. 2023–24 విద్యా సంవత్సరం నుంచి 2026–27 వరకు నాలుగేళ్లకు



గానూ ఒక్కో ఏడాదికి ఒక్కో బ్రాంచికి 60 చొప్పున 240 సీట్లను ప్రభుత్వం కేటాయించింది. మొత్తమ్మీద ఐదు బ్రాంచిలకు 1,200 సీట్లు ఉండనున్నాయి. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, జేఎన్‌టీయూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం నూతన కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించనున్న నేపథ్యంలో అనువైన భవనాల కోసం అధికారులు అన్వేషిస్తున్నారు. నూతన భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని ఇప్పటికే ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాలో ఇంతవరకు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు తప్ప ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇంజినీరింగ్ కళాశాల ఒక్కటీ లేదు. జేఎన్‌టీయూ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపటంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కశాశాల ఏర్పాటుతో ఖమ్మంతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ జిల్లాల విద్యార్థులకు ప్రయోజనం చేకూరవచ్చు.

# 72 గంటల నిరంతర ఎత్తిపోతలకు విద్యుత్తు సమస్య

గోదావరిఖని: కోనరావుపేట మండలం మల్కపేట వద్ద నిర్మించిన కాళేశ్వరం ప్యాకేజీ–9 రిజర్వాయర్‌కు 72 గంటల పాటు నిరంతర ఎత్తిపోతల ద్వారా నీటి తరలింపునకు సోమవారం విద్యుత్తు సమస్య తలెత్తింది. శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి రెండు పర్యాయాలు మొదటి, రెండో పంపుహౌస్‌లతో వేర్వేరుగా 12 కిలో మీటర్ల సొరంగ మార్గం ద్వారా ట్రయల్‌రన్ విజయవంతమైంది. మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డి, ప్యాకేజీ–9 ఈఈ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో ఎంఆర్‌కేఆర్, డబ్ల్యూపీఎల్ కంపెనీ ప్రతినిధుల సహకారంతో కలెక్టర్ అనురాగ్ జయంతి మార్గనిర్దేశంతో శనివారం ఉదయం 10 గంటలకు రెండు పంపులను ఏకకాలంలో నడిపించి గోదావరి జలాలను మల్కపే



ట రిజర్వాయర్‌లోకి ఎత్తిపోశారు. అనంతరం మొదటి పంపును ట్రాన్స్‌కో అధికారుల అనుమతితో 72 గంటల పాటు నిరంతరంగా నడిపించి నీటిని తరలించేలా ఇంజినీరింగ్ అధికారులు సన్నద్ధం చేశారు. 48 గంటల పాటు పంపు నడవగా విద్యుత్తు కొరత నెలకొనటంతో నీటి తరలింపు నిలిపివేశారు. దీనిపై 'న్యూస్‌టుడే' కాళేశ్వరం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లను ఫోనులో సంప్రదించగా ట్రాన్స్‌కో అధికారుల సూచనల మేరకు పంపు నిలిపివేశామన్నారు. పంపుల్లో ఎలాంటి సాంకేతిక సమస్య లేదని, ట్రాన్స్‌కో అధికారుల విద్యుత్తు సరఫరాతో త్వరలోనే పంపులు నడిపిస్తామన్నారు.

# పనులు చేయకుండానే బిల్లులు!

గోదావరిఖని: రామగుండం నగరపాలక సంస్థలో మరో కుంభకోణానికి తెరలేస్తోందనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. చేయని పనులకు బిల్లులు దండుకోవడానికి పలువురు గుత్తేదార్లు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. పెండింగ్‌లో పెట్టిన పనులు జరిగినట్లు బిల్లులు సృష్టించే ప్రయత్నాలు సాగుతున్నట్లు సమాచారం. సుమారు రూ.14 లక్షలు స్వాహా చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఏడాది క్రితం ఇక్కడ పనిచేసిన అధికారుల సంతకాలతో రికార్డులు తయారు చేయించే పనిలో కొందరు గుత్తేదార్లు నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఇది సజావుగా జరిగితే మరికొన్ని పనులకు సంబంధించి ఇదే విధంగా బిల్లులు దండుకోవడానికి ప్రణాళికలు వేసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే నగరపాలక సంస్థ అవినీతి, అక్రమాలకు నిలయంగా మారిందనే విమర్శలున్నాయి. ఏడాది క్రితం కొన్ని డివిజన్‌లలో మరమ్మతుల కోసం చేపట్టాలనుకున్న పనులు రద్దు చేశారు. ఈ పనులను పెండింగ్‌లో పెట్టి ఎవరికీ కేటాయించలేదు. నామినేషన్ కింద కేటాయించాలనుకున్న పనులపై వివాదం తలెత్తడంతో వాటిని నిలిపివేశారు. తాజాగా ఆ పనులకు సంబంధించి బిల్లులు దండుకోవడానికి కొంతమంది గుత్తేదార్లు ప్రయత్నిస్తున్నారు. దీనికి కొంత మంది సిబ్బంది సహకారం అందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధాని పర్యటన సందర్భంగా చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు కూడా కొందరు నగరపాలక గుత్తేదార్లు తమ ఖాతాలో వేసుకోవడానికి యత్నిస్తున్నట్లు సమాచారం. ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్ల పనులకు సంబంధించి ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం బిల్లులు చెల్లించింది. వాటిని కూడా తమ ఖాతాలో వేసుకుని బిల్లులు వసూలు చేసుకోవడానికి కొంత రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది.

# ఇల్లెందు.. మళ్లీ ముందు

ఖమ్మం : ఇల్లెందు పురపాలకం మరో అడుగు ముందుకేసింది. ఇప్పటికే పట్టణంలో తడి, పొడి చెత్తను సేకరించి డీఆర్‌సీసీ భవనంలో ఎరువు తయారు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు సాధించిన విషయం తెలిసిందే. అదేవిధంగా మానవ మల, మూత్ర వ్యర్థాల నుంచి ఎరువు తయారు చేసే కేంద్రాన్ని నిర్మించి మరో రికార్డు నమోదు చేసుకుంది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బైపాస్‌లోని చెత్త డంపింగ్ యార్డు ఆవరణలో ఏడాదిగా నిర్మిస్తున్న 10 కేఎల్‌డీ సామర్థ్యం కలిగిన మానవ మల, మూత్ర వ్యర్థాల శుద్ధి కేంద్రం (ఎఫ్ఎస్‌టీపీ) నిర్మాణం పూర్తయింది. జిల్లాలోనే మొట్టమొదటి సారి ఇల్లెందులో ఈ కేంద్రాన్ని నిర్మించారు. మానవుల నుంచి వచ్చే వ్యర్థాన్ని సేకరించి ఎరువుగా తయారు చేసేందుకు ఈ కేంద్రం ఏర్పాటు చేశారు. రూ.80 లక్షలతో అన్ని రకాల యంత్రాలు, పరికరాలను బిగించారు. రెండు రోజుల క్రితం ఎరువు తయారీ ప్రక్రియను పురపాలక ఛైర్మన్ డీవీ, కమిషనర్ షేక్ అంకుశ్ షావలీలు పరిశీలించారు.

ఎరువు తయారీ విధానం

ఇళ్లలో నిండిన సెప్టిక్ ట్యాంకు నుంచి పురపాలక సెప్టిక్ ట్యాంకు వాహనం ద్వారా మానవ వ్యర్థాన్ని ఎఫ్ఎస్‌టీపీ కేంద్రానికి తీసుకువ



స్తారు. దాన్ని స్క్రీనింగ్ ఛాంబర్‌లో అన్‌లోడ్ చేస్తారు. అక్కడ నుంచి కలెక్టింగ్ ట్యాంకుకు పంపి మోటారు ద్వారా డివాటరింగ్ యంత్రానికి చేరుస్తారు. అక్కడ వ్యర్థంలోని ఘన పదార్థం, నీరు వేరుచేస్తారు. ఘన పదార్థాన్ని సోలార్‌బెడ్ వద్దకు పంపించి వేడి చేయడంతో అది ఎండిపోతుంది. దాన్ని క్రషింగ్ చేసి పొడిగా మారుస్తారు. అనంతరం అది ఎరువుగా తయారవుతుంది. క్రషింగ్‌లో తేడాలను ల్యాబ్‌లో పరిశీలించుకుంటూ ప్రక్రియను కొనసాగిస్తారు. తయారు చేసిన ఎరువును పురపాలకం ఆధ్వర్యంలో విక్రయించి ఆదాయాన్ని పొందనున్నారు. అదేవిధంగా వేరు చేసిన నీటిని శుద్ధి చేసి మొక్కల పెంపకానికి వినియోగిస్తారు. త్వరలో ప్రారంభం పురపాలక ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మానవ మల, మూత్ర వ్యర్థాల నుంచి ఎరువు తయారు చేసే కేంద్రం నిర్మాణం పూర్తి చేశాం. పట్టణంలోని ప్రజల ఇళ్లల్లో సెప్టిక్ ట్యాంకు నిండితే పుర వాహనంలో వ్యర్థాన్ని సేకరించి ప్లాంటుకు తరలిస్తాం. త్వరలో పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, మంత్రి అజయ్‌కుమార్, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఆధ్వర్యంలో కేంద్రాన్ని ప్రారంభిస్తాం. ఎరువు తయారీకి పురపాలకం చేపడుతున్న పనులకు ప్రజలు సహకరించాలి.

# గ్రామీణులకు వరం.. ఉపాధి హామీ పథకం

మహబూబాబాద్ : గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి గ్రామంలోనే ప్రజలకు ఉపాధి కల్పించి, ఆర్థిక భరోసా కల్పించేలా సుమారు 17 సంవత్సరాల క్రితం కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. గ్రామీణ స్థాయిలో ప్రజలకు పనులు కల్పించడం, కూలీలకు సకాలంలో వేతనాలు అందించడం ఆర్థికంగా ఎదిగేలా ఉపాధిహామీ పథకం ఎంతగానో తోడ్పడుతోంది. గ్రామాల్లో శ్మశాన వాటికలు, డంపింగ్‌యార్డు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీల పెంపకం, మూగజీవాలకు షెడ్ల నిర్మాణం తదితర పనులన్నీ ఈ పథకం ద్వారా అమలు చేస్తున్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 18 లక్షల పనిదినాలను ఖరారు చేస్తూ జిల్లా కలెక్టర్ ఆమోదించారు.

వలసలను నిరోధించేలా...

గ్రామాల్లో సరైన పనులు లేకపోవడంతో ప్రజలు వలస బాట పట్టారు. కరోనా సమయంలో సొంత గ్రామాలకు తిరిగివచ్చిన వలసకూలీలకు



సైతం ఉపాధిహామీ పథకం ప్రధాన ఆధారంగా మారింది. అనుకున్న లక్ష్యం మేరకు జిల్లా వ్యాప్తంగా అర్హులైన ప్రతి కూలికి పనులు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

అభివృద్ధి పనులకే మొగ్గు

జిల్లా వ్యాప్తంగా 2023- 24 ఆర్థిక సంవత్సరానికిగాను చేపట్టే ఉపాధిహామీ పనుల్లో భాగంగా గ్రామాభివృద్ధి దృష్ట్యా ఇంకుడు గుంతలు, పశువుల షెడ్ల నిర్మాణం, చెక్ డ్యామ్‌లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, నీటి పారుదల కాలువల పూడికతీత, తదితర గ్రామాభివృద్ధికి అవసరమయ్యే పనులను చేపట్టనున్నారు. ఇందుకు గాను మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.75 లక్షలు కేటాయించగా కూలీల చెల్లింపులకు సంబంధించి రూ.11.32 కోట్ల నిధులను కేటాయించారు. మొత్తంగా రూ.12.08 కోట్లను కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ ఆమోదించారు.

వందశాతం పూర్తి చేస్తాం

-పురుషోత్తం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 18 లక్షల పనిదినాలుగా లక్ష్యం నిర్దేశించాం. గ్రామసభలు నిర్వహించి గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించాం. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వందశాతం పనుల లక్ష్యం పూర్తి చేస్తాం.

# అడ్డుకట్ట పడేనా..!




ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు ఏపీకి చెందిన దళారీ వ్యాపారులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. అక్కడి రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి.. ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయించేందుకు యత్నిస్తున్నారు. రాత్రివేళల్లో ధాన్యం లారీలను సరిహద్దు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలని ప్రయత్నిస్తూ ఇటీవల పట్టుబడ్డారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలో 3, వేంసూరు మండలంలో రెండు లారీలు ఇలా పట్టుబడ్డాయి. అయినా చెక్‌పోస్టుల వద్ద యంత్రాంగం కళ్లుగప్పి ధాన్యం లారీలు వస్తున్నాయన్న వాదన ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ధాన్యం సేకరణ గాడినపడుతున్న వేళ గతానుభవాలూ రైతుల్లో దడ పుట్టిస్తున్నాయి. పటిష్ఠ నిఘా ఏర్పాటు ద్వారా పక్క రాష్ట్రం ధాన్యం రాకకు ఆదిలోనే అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు చెబుతున్నారు.

గతంలో ఇలా..ఏపీలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తుంటారు. వారినుంచి తక్కువ ధరలకు ధాన్యం కొనే వ్యాపారులు మన కేంద్రాల్లో విక్రయించి సొమ్ము చేసుకోవాలన్న ఉద్దేశంతో వక్రమార్గం అన్వేషిస్తున్నారు. ఏపీలోని ఎన్టీఆర్, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన ధాన్యాన్ని గతంలో యథేచ్ఛగా సరిహద్దు కొనుగోలు కేంద్రాలకు తరలించి నిర్వాహకులతో కుమ్మక్కై విక్రయాలు చేపట్టారన్న ఆరోపణలున్నాయి. స్థానిక ఐకేపీ, సహకార సంఘాలు, డీసీఎంఎస్, మార్కెట్ యార్డు కేంద్రాల్లోని కొంతమంది వీరితో కుమ్మక్కై ఈ తంతు సాగిస్తున్నారు. ఈసారీ ఇదే ప్రయత్నాల్లో ఉన్నారనేందుకు పట్టుబడ్డ లారీలే నిదర్శనం.

సరిహద్దు మండలాల్లో..ఏపీ నుంచి ధాన్యం ఇక్కడికి తీసుకొచ్చి విక్రయిస్తే ఉభయ జిల్లాల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. దీన్ని నిరోధించేందుకు సరిహద్దు ప్రాంతాలుగా ఉన్న మండలాల్లో అధికారులు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 10, భద్రాద్రి జిల్లాలో 6 చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. మొత్తం 16 చెక్‌పోస్టుల ద్వారా అక్రమ రవాణాను అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు.

చర్యలు తప్పవు

ఏపీ నుంచి జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి విక్రయించకుండా పటిష్ట చర్యలు తీసుకున్నాం. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో 10 చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. పోలీసు, వ్యవసాయ, రెవెన్యూ యంత్రాంగంతో నిఘా పెట్టాం. ఏపీ నుంచి ధాన్యం తెచ్చిన వారిపై చర్యలు తప్పవు. మధుసూదన్, అదనపు కలెక్టర్

# మణుగూరు.. వనగూరు



ఖమ్మం :అడవి అంటే జంతు ఒడి.. పచ్చని చెట్లతో, భిన్న వర్ణాల పూలతో, స్వచ్ఛమైన పరిమళాలతో మనసును మురిపించే బృందా'వన'మది.. పక్షుల కిలకిలరావాలకు.. రాగాలకూ గొంతు'కారదవే'. క్రిమికీటకాదుల స్వేచ్ఛా సంచారానికి అరణ్యమే శరణ్యం. వనం చిక్కగుంటేనే అందులో ప్రాణులు చక్కగుంటాయి.. వన్య ప్రాణుల భద్రమైన జీ'వనం'లోనే వైవిధ్యం ఇమిడి ఉంది. మనిషి అవసరాలు శ్రుతిమించి, విలాసాలుగా మారిన వేళ అడవి చిన్నబోతోంది. జీవావరణం మాయమవుతోంది. 'నాగరిక మనిషి' దూరిన అడవిలో చెట్లు మొట్లుగా, నదులు పిల్ల కాలువల్లా మారిపోయాయి. అనుభవమైతేగాని తత్వం బోధపడదన్నట్టు ప్రకృతిలో వచ్చిన 'అకాల' మార్పులు మనలో మార్పులు తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోయినచోటే వెతుక్కుంటూ, కోల్పోయిన ప్రకృతి సంపదను పట్టుకునే, రాబట్టుకునే ప్రయత్నం చేస్తోంది మణుగూరు అటవీ యంత్రాంగం. వినూత్న పద్ధతులతో జీవజాలం 'వన'గూరే ప్రయత్నం చేస్తోంది. మణుగూరు అటవీ డివిజన్‌లో పలు రకాల వృక్షాలున్నాయి. వన్య జీవులూ పెద్ద సంఖ్యలో ఉన్నాయి. బొగ్గు గనులు, గోదావరిపై ఆనకట్టల నిర్మాణాలు, విద్యుత్తు కేంద్రాలకు రైలుమార్గం ఇలా అన్నీ అటవీ భూభాగం మీదుగానే విస్తరించాయి. ఇంకా విస్తరిస్తూనే ఉన్నాయి. దీంతో అడవికి, వన్య ప్రాణుల ఉనికికి ప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అటవీ జంతు సంతతిని పెంచేందుకు స్థానిక యంత్రాంగం రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా వినూత్న పద్ధతులు తెరపైకి తెచ్చింది. గడ్డిజాతి ప్రాణులు, పక్షిజాతుల వృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆరు నెలలుగా ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తూ సానుకూల ఫలితాలు సాధిస్తున్నారు. మణుగూరు డివిజన్‌లో మేకజాతి ప్రాణులు దుప్పి, జింక, కొండగొర్రె, గడ్డి జాతులు కుందేలు, దున్నలు, మనుబోతులు, కుక్క జాతులైన నక్కలు, తోడేలు, గుడ్డేలుగులున్నాయి.

జిల్లాలో ఆరు డివిజన్లు ఉండగా మొత్తం 410 లక్షల హెక్టార్ల అడవి ఉంది. మణుగూరులో 22 వేలు, అశ్వాపురంలో 15, ఏడూళ్లబయ్యారంలో 29 వేల హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. ఇందులో 79 రకాల వృక్షాలు, 13 రకాల వన్యప్రాణులు, 19 రకాల పక్షి జాతులు ఉన్నాయి.

పక్షి జాతుల కోసం..పక్షి జాతుల కోసం కొలను ఏర్పాటు చేశారు. వెదురు జాతి చెట్లున్న చోట సుమారు 10 హెక్టార్లలో విస్తీర్ణంలో దీన్ని అందుబాటులోకి తెచ్చారు. కొలను చుట్టూ గడ్డి పెంచి పురుగులు, పాముల సంచారం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. పురుగులు వస్తే తొండలు, కప్పలు ప్రవేశిస్తాయి. వాటికోసం పక్షులు వచ్చి వాలుతాయి. వచ్చిన పక్షులు గూళ్లు పెట్టుకునేందుకు వీలుగా వెదురు కర్రలు ఉపయోగపడుతున్నాయి.

వేదిక ఇది..మార్చి నెల నుంచి గడ్డి ఎండిపోతుంది. దీంతో ఆహారం దొరక్క చాలా ప్రాణులు చనిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఆహారం అందించటానికి గడ్డి పెంపకం చేపట్టారు. మణుగూరు మండలం బుగ్గ పరిసరాలను వేదికగా ఎంచుకున్నారు. జంతువుల కోసం..అటవీ డివిజన్‌లో మూడుచోట్ల సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆరు బోర్లను వేసి కొలనులు నిర్మించారు. నిరంతరాయంగా బోరు నీరు కొలనులో చేరుతుంది. ఇదే ప్రాంతంలో ఫైబర్ ఎక్కువగా ఉండే గడ్డి విత్తనాలు చల్లారు. గడ్డికి నీరు అందడం వల్ల ఏపుగా పెరిగింది. దీన్ని తిని, నీరు తాగి జంతువులు ముందుకెళుతున్నాయి. వేసవిలో జంతువుల అలసట తీర్చటంలో భాగంగా గడ్డి విస్తరించిన ప్రాంతాల్లో ఉప్పుతో కలిపిన రేగడి మట్టి గుంతలు ఏర్పాటు చేశారు. జంతువులు ఈ మట్టిని నాకడం ద్వారా లవణాలు అందుతాయి."మణుగూరు అడవి గుండాల, కిన్నెరసాని, అశ్వాపురం ప్రాంతాల వరకూ విస్తరించి ఉంటుంది. మొత్తంగా వనం కుదింపునకు గురవటంతో పునరుత్పత్తి (రీజనరేషన్) తప్పనిసరైంది. ఇక్కడ బొగ్గు గనుల విస్తరణతో వేల హెక్టార్లకు నష్టం వాటిల్లింది. బుగ్గ ప్రాంతంలో నేలపై పడ్డ విత్తనాలు అగ్గికి కాలిపోకుండా కాపాడి మొక్కలు చేశాం. ఆ మొక్కలు జంతువులకు ఆహారంగా మారాయి. వాటి రక్షణకు శ్రీకారం చుట్టాం."

సయ్యద్ మక్సూద్ మొయినుద్దీన్, ఫారెస్టు డివిజనల్ అధికారి

"వేసవిలో గడ్డికొరతను గుర్తించి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పెంచుతున్నాం. కొన్ని వన్య ప్రాణుల రాక మొదలైంది. భవిష్యత్తులో మరో ఐదురకాల గడ్డి జాతులు పెంచాలని అనుకుంటున్నాం."ద్వాలియా, రేంజ్ అధికారి, మణుగూరు.

# ఆదాయ గని

ఖమ్మం : గ్రావెల్, స్టోన్‌మెటల్ వినియోగం, విక్రయాలు రెండేళ్లలో రెట్టింపు అయ్యాయి. దీంతో గనుల శాఖ ఆదాయం భారీగా పెరుగుతోంది. గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఖమ్మం-కోదాడ రోడ్డు నిర్మాణం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా గ్రావెల్, స్టోన్‌మెటల్ వినియోగం ఎక్కువైంది. ఉపాధి పథకంలో పలు గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైన్లు నిర్మాణం చేపట్టారు. దీంతో స్టోన్ మెటల్ వాడకం పెరిగింది.ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గనుల శాఖకు ఆదాయం మరింత పెరగనుందని అంచనా. గనుల తవ్వకానికి లీజు అనుమతులు అధిక సంఖ్యలో మంజూరు చేసినా, మార్కెట్‌లో డిమాండ్ ఆధారంగా ఆయా ఖనిజాల తవ్వకాన్ని చేపడుతుంటారు. చాలా ఖనిజాల తవ్వకానికి అనుమతులు పొందిన వారు చాలా మంది క్వారీ తవ్వకాలు చేయటంలేదు. గ్రానైట్ క్వారీల నుంచి 2021-22లో 34 వేల ఘనపు మీటర్ల ముడి రాయి వెలికి తీసేందుకు అనుమతివ్వగా 22-23లో 33వేల ఘనపు మీటర్లకు అనుమతులిచ్చారు. క్వారీల్లో గ్రానైట్ ముడిరాయి లభ్యత తగ్గింది. గ్రానైట్ పరిశ్రమల్లో పాలిష్ చేసిన గ్రానైట్ పలకలు 2021-22లో 2.46 లక్షల చదరపు అడుగుల రవాణాకు అనుమతులివ్వగా, 2022-23లో 2.84 లక్షల చదరపు అడుగులకు పర్మిట్ ఇచ్చింది."ఏటా ఆదాయం పెంచాల్సిన బాధ్యత మాపై ఉంది. గత సంవత్సరంలో రూ.75.04 కోట్లు ఆదాయం లభించింది. ఈ ఏడాది పెరగాలి. గతేడాది 492 కేసులు నమోదు చేసి అపరాధ రుసుం రూపంలో రూ.64.25 లక్షలు వసూలు చేశాము."సంజయ్‌కుమార్, గనుల శాఖ ఏడీ, ఖమ్మం

# లక్షలు వెచ్చించి.. నిర్లక్ష్యంగా వదిలేసి!

మహబూబాబాద్ : ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. దాహాన్ని తీర్చుకునేందుకు మనుషులే కాదు మూగ జీవాలు సైతం అల్లాడుతున్నాయి. మేతకు వెళ్లిన జీవాలు నీరు దొరకక అలమటిస్తున్నాయి. ఇంటికి వచ్చే వరకు వాటికి నీరు దొరకడం లేదు. వేసవికాలంలో పశువులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణాలు చేపట్టారు. వాటి నిర్వహణను అధికారులు, ప్రజాప్రతినిధులు గాలికి వదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. పలు చోట్లలో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువుల దాహార్తిని తీర్చేందుకు దాదాపు 1000 పశువుల నీటి తొట్టెలను నిర్మించారు. ఒక్కో నీటి తొట్టికి రూ.20వేల వరకు వెచ్చించారు. ఈ నీటితొట్టెలకు పంచాయతీల ఆధ్వర్యంలో నీటి సరఫరా అందించి పశువుల దాహార్తిని తీర్చడానికి నిర్మించగా అధికారుల అలసత్వం, పాలకుల నిర్లక్ష్యం కారణంగా అవి ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. ప్రస్తుతం ఎండల కారణంగా చెరువుల్లో, వాగుల్లో, కుంటల్లో నీరు అడుగంటిపోతోంది.. బయటకు వెళ్లిన పశువు ఇంటికి వచ్చేదాక నీరు దొరకని పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో నిర్మించిన తొట్టెలలో నీరు నింపకపోవడంతో మూగజీవాలు ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నాయి.



మూగరోదన..

మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టెలు వివిధ కారణాలతో నిరుపయోగంగా ఉంటున్నాయి. ఫలితంగా నోరు తెరచి అడగలేని ఆ జీవాలు దాహం తీర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాయి. అవసరం లేని ప్రదేశాల్లో, నీటి జాడలేని స్థలాల్లో నీటి తొట్టెలను నాసిరకంగా నిర్మించి రూ.లక్షల నిధులు వెచ్చించారు. వాటికి పంచాయతీ ఆధ్వర్యంలో నీటి సరఫరా చేయాల్సి ఉండగా ఎవరు పట్టించుకోవడం లేదు. నీటి జాడను తెలుసుకునేందుకు పాడి రైతులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. దాహార్తితో అలమటిస్తున్న మూగ జీవాలకు రోదన తప్పడం లేదు.

నీళ్లు నింపేలా చర్యలు తీసుకుంటాం..

-ఆశాలత, డీపీవో, భూపాలపల్లి జిల్లా

గ్రామాల్లో నిరుపయోగంగా మారిన నీటి తొట్టెలను వినియోగంలోకి తీసుకొస్తాం. తొట్టెలు ఉన్న చోట్ల నీటిని నింపేలా చర్యలు తీసుకుంటాం. నీటి కొరత కారణంగా కొన్ని తొట్టెలు నిరుపయోగంగా మారాయి. నీటి సౌకర్యం లేని చోట ట్యాంకర్‌తో నింపించేలా ఎంపీవోలకు ఆదేశాలు జారీ చేస్తాం. వేసవిలో మూగజీవాల దాహార్తిని తీరుస్తాం.

# పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులు

మహబూబాబాద్ : విద్యార్థుల్లో చదువుతోపాటు జీవన నైపుణ్యాలు, సృజనాత్మకతను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా పలు కార్యక్రమాలు చేపడుతోంది. సమగ్ర శిక్ష పథకంలో భాగంగా విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులు నేర్పించేందుకు చర్యలు చేపడుతోంది. జిల్లాలోని పలు ఆదర్శ పాఠశాలల్లో ఇప్పటికే ఈ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. 2020 నూతన జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా సెకండరీ, హయ్యర్ సెకండరీ విద్యలో వృత్తి విద్యా కోర్సులను అమలు చేస్తున్నారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఆదర్శ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పథకం అమలవుతోంది.

మరిన్ని బడులకు విస్తరణ

ఈ విద్యా సంవత్సరంలో ధర్మకంచ, శివునిపల్లి, పాలకుర్తి జడ్పీహెచ్ఎస్‌లో ఈ కోర్సులను ప్రారంభించనున్నారు. వచ్చే ఏడాది జిల్లాలోని మరో 3 ప్రభుత్వ బడులతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, జనగామ కస్తూర్బా విద్యాలయాల్లో అమలు చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్లు



సమాచారం. ప్రతి పాఠశాలలో రెండు కోర్సులు ఉంటాయి, ఒక్కో కోర్సుకు రెండేళ్ల వ్యవధి ఉంటుంది. వచ్చే ఏడాది మరిన్ని బడులకు ఈ కోర్సులను విస్తరించనున్నారు.

విద్యార్థులకు మంచి అవకాశం: శ్రీనివాస్, ఏఎంవో, జనగామ

ప్రభుత్వం ప్రవేశపెట్టిన వృత్తి విద్యా కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. నైపుణ్యం చూపితే భవిష్యత్తులో ఉపాధి కూడా పొందగలుగుతారు. తమ కాళ్లపై తాము నిలబడగలుగుతారు. భవిష్యత్తులో విద్యార్థులకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ కోర్సులను అమలు చేస్తోంది.

బోధన విధానం ఇలా..ఈ పథకంలో ఒక్కో వృత్తి విద్యా కోర్సుకు వారానికి మూడు పీరియడ్లు కేటాయిస్తారు. ఈ లెక్కన రెండు కోర్సులకు వారానికి ఆరు పీరియడ్లు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రత్యేక కన్సల్టెన్సీలతో వీటిని అమలు చేస్తున్నా రు. ఇప్పటికే ప్రతి బడికి ఇద్దరు శిక్షకులను కూడా నియమించారు. వ్యవసాయం, అప్పారెల్, ఆటోమోటివ్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్, ఐటీ అండ్ ఐటీఈఎస్, మీడియా ఎంటర్‌టైన్‌మెంట్, రిటైల్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్, ప్లంబర్ తదితర కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లాలోని 8 ఆదర్శపాఠశాలల్లో ఈ కోర్సులను అమలు చేస్తున్నారు.




# పోలీసులు-కార్మికుల మధ్య తోపులాట...

విశాఖపట్నం: విశాఖపట్నం జిల్లా గంగవరం పోర్టు వద్ద కార్మికులు చేపట్టిన 'పోర్టు బంద్' ఉద్రిక్తతకు దారి తీసింది. కార్మికులు, పోలీసులకు మధ్య జరిగిన తోపులాటలో పలువురికి గాయాలయ్యాయి. తొలగించిన పోర్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవడంతో పాటు కనీస వేతనం రూ.36వేలు చెల్లించాలనే డిమాండ్లతో కార్మిక సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో గురువారం ఉదయం పెద్ద ఎత్తున కార్మికులు, నిర్వాసితులు, కాలుష్య ప్రభావిత ప్రాంతాల ప్రజలు, అఖిలపక్ష నేతలు గంగవరం పోర్టు వద్దకు చేరుకున్నారు. బంద్ పిలుపు నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. పోర్టు ప్రధాన ద్వారానికి 100 మీటర్ల దూరంలోని అదనపు గేటు వద్ద ఆందోళనకారులను అడ్డుకునేందుకు యత్నించారు. గేటుకు ఇరువైపులా భారీ ఇనుప కంచె ఏర్పాటు చేశారు.

పెద్ద ఎత్తున తరలివచ్చిన పోర్టు కార్మికులు కంచెను దాటుకుని తమ కుటుంబాలతో కలిసి ముట్టడికి యత్నించారు. దీంతో ఆందోళనకారులు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటనలో పలువురు కార్మికులు, పోలీసులకు గాయాలయ్యాయి. 10 మంది పోలీసులు గాయపడగా.. వారిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తోపులాటలో గాజువాక సీఐ కాలిలో ముళ్ల కంచె దిగింది.




తిరుమల: తిరుమలలో మరో చిరుత చిక్కింది. లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బోనులో చిరుత చిక్కినట్లు అటవీశాఖ, తితిదే అధికారులు తెలిపారు. ఇటీవల అలిపిరి నడక మార్గంలో చిరుత దాడి చేయడంతో నెల్లూరు జిల్లాకు చెందిన ఆరేళ్ల బాలిక లక్షిత మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చిరుతను బంధించేందుకు నడక మార్గంలో మూడు ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటు చేశారు. మోకాలిమిట్ట, లక్ష్మీనరసింహస్వామి ఆలయం, 35వ మలుపు వద్ద బోన్లు ఉంచారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం బోనులో ఓ చిరుత చిక్కగా.. తాజాగా గురువారం వేకువజామున మరో చిరుత చిక్కినట్లు అధికారులు తెలిపారు. 50 రోజుల వ్యవధిలో మూడు చిరుతలను బంధించినట్లు చెప్పారు.

# భక్తులకు కర్రల పంపిణీ.. ట్రోల్స్‌పై స్పందించిన తితిదే ఛైర్మన్



తిరుమల: తిరుమలలో మరో చిరుత బోనులో చిక్కిన ప్రదేశాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి పరిశీలించారు. బోనులో చిక్కిన మగ చిరుతకు దాదాపు ఐదేళ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. మరోవైపు, అలిపిరి నడక మార్గంలో భక్తులకు కర్రల పంపిణీపై సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్‌ను ఛైర్మన్ భూమన ఖండించారు. అటవీశాఖ అధికారుల సూచన మేరకే కర్రలు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. కర్రలు ఇచ్చి తితిదే బాధ్యతలను తప్పించుకుంటుందని ట్రోల్స్ చేయడం సమంజసం కాదన్నారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆపరేషన్ చిరుతను కొనసాగిస్తామని, మరిన్ని చిరుతలు బంధించేలా కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ.. "ఎస్వీ జూ పార్కు నుంచి చిరుతలు తెచ్చి వదులుతున్నామంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఈ తప్పుడు ప్రచారాలను ఖండిస్తున్నాం. చిరుత సంచారంపై నిఘా కోసం కెమెరాలు ఏర్పాటు చేశాం. ఎలుగుబంట్ల సంచారంపై డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెట్టాం" అని చెప్పారు.

# చిన్నారిని చంపిన చిరుత దొరికింది.. బాబాయ్‌ను చంపిన చిన్నోడు దొరకలేదు



ఎన్టీఆర్ జిల్లా: తిరుమల తిరుపతి పవిత్రతపై వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్ర విమర్శలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... సైకో ప్రభుత్వం సైకో చేష్టలు చివరి స్టేజ్‌కు చేరుకున్నాయన్నారు. "చిన్నారిని చంపిన చిరుత దొరికిందని.. బాబాయ్‌ను చంపిన చిన్నోడు దొరకలేదు, చంపించిన వాడు చక్కని చిరునవ్వుతో తిరుగుతున్నాడు" అంటూ వ్యాఖ్యలు చేశారు. జగన్ రెడ్డి పిచ్చి పరాకాష్టకు చేరిందన్నారు. తిరుపతి వచ్చే భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీ ప్రవర్తిస్తోందన్నారు. మూర్ఖత్వపు ప్రభుత్వం, జగన్ రెడ్డిని అడుగుతున్నా.. శబరిమలలో జంతువులు లేవా?, అక్కడ భక్తులను ప్రభుత్వం కాపాడుకోవడం లేదా అని ప్రశ్నించారు. తిరుమల వచ్చే భక్తులను వైసీపీ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా భయపెడుతోందని, భక్తుల మనోభావాలతో ఆటలు ఆడుతున్నారని మండిపడ్డారు. నడక మార్గం మూసివేస్తామని లీకేజీలు ఇస్తారా? అని ప్రశ్నించారు. తిరుమల పవిత్రతను దెబ్బతీయడానికి వైవీ సుబ్బారెడ్డి సమయంలోనే ఎన్నో కుట్రలు జరిగాయని... ఇప్పుడున్న ఛైర్మన్ తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. జంతువులను పారదోలడానికి తీసుకోవాల్సిన చర్యలు మానివేసి, భక్తులకు కర్రలు ఇవ్వడం విడ్డూరంగా ఉందని టీడీపీ నేత వ్యాఖ్యలు చేశారు.

# అరుకు స్కూల్స్‌లో పరిస్థితులు దారుణం.. ఆ పిల్లల కష్టాలు వింటే బాధగా ఉంది



విశాఖపట్నం: ఏపీలో జనాభాకు సరిపడే స్కూల్స్ కట్టలేదని.. జగన్‌కు ప్రచార పిచ్చి ఎక్కువైందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విరుచుకుపడ్డారు. నగరంలో జనసేన జనవాణి కార్యక్రమంలో పవన్ మాట్లాడుతూ.. అరకులోని స్కూల్స్‌లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయన్నారు. అమ్మ ఒడి.. నాన్న ఒడి అంటున్నారని... స్కూల్స్‌లో మౌలిక సదుపాయాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సాలూరు నుంచి పిల్లలు వచ్చి వారి కష్టాలను చెప్పారని.. చాలా బాధగా అనిపించిందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో స్కూల్‌కు పై కప్పులు లేకపోవడం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీ నాయకులు కూడా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సీఎం జగన్ పట్టించుకోడని.. ఎస్సీ, ఎస్టీ మంత్రులు పట్టించుకోవాలని హితవుపలికారు. 2019 ఎన్నికల ముందు జగన్ ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చారన్నారని.. అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు, ఉద్యోగులకు మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలు సంగతి అడిగితే బెదిరిస్తున్నారని.. మంత్రులు బూతులు తిడుతున్నారన్నారు. జగన్ కొత్త ఉద్యోగాలు ఇవ్వలేదని... 5 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. 2024 లో వైసీపీ ప్రభుత్వం రాదు అని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేశారు.




# రేపటి నుంచి ముహూర్తాలే... ముహూర్తాలు...!

జూన్ 9తో పెళ్లి ముహూర్తాలు ముగియడంతో వివాహాలకు 70 రోజుల సుదీర్ఘ విరామం వచ్చింది. మళ్లీ తిరిగి పెళ్లి సందడి ఆరంభం కానుంది. ఇప్పటికే శ్రావణమాసం రావడంతో ఈ నెల 19న తొలి ముహూర్తం నిశ్చయమైంది. పల్లెల నుంచి పట్టణాల వరకు కల్యాణ మండపాలు కళకళలాడనున్నాయి. ఒక పక్క శ్రావణమాసం మరో పక్క శుభ ముహూర్తాల వేళ అన్నిచోట్ల మార్కెట్లో వ్యాపారాలు ఊపందుకోనున్నాయి. కల్యాణ మండపాల్లో పెళ్లి పీటలు బయటకు తీసి శుభ్రం చేయడంతోపాటు విద్యుత్తు పరికరాలు ఎలా పనిచేస్తున్నాయనే దానిపై నిర్వాహకులు తనిఖీలు చేసుకుంటూ సిద్ధమవుతున్నారు. ప్రస్తుత సీజన్లో వివాహాలతోపాటు గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలకు కూడా బలమైన ముహూర్తాలున్నట్లు పెనుగొండకు చెందిన జోశ్యుల ప్రభాకరశర్మ తెలిపారు. వివాహాలకు ఈ నెలలో 19, 21, 24, 26, 27, 30, 31 వరకు ముహూర్తాలున్నాయి. సెప్టెంబర్‌లో 2, 3, 6, 7, 8 తేదీల్లోను వివాహాలు జరగనున్నాయి. అక్టోబరులో 25, 26, 27, నవంబరులో 1, 3, 4, 8, 9, 16, 17, 18, 19, 22, 23, 24, 25, 29, డిసెంబర్‌లో 6, 7, 8, 15, 16, 17, 21, 31 తేదీల్లో శుభలగ్నాలున్నాయి.

**గృహ ప్రవేశాలిలా** ఆగస్టు 19, 21, 14, 26, 27, 30, 31, సెప్టెంబర్ 2, 4, 6, 7, 8, 9 అక్టోబర్ 25, 26 నవంబర్‌లో 1, 2, 3, 4, 8, 9, 30 డిసెంబర్‌లో 1, 2, 3, 4, 6, 8, 15, 18, 20, 27, 28, 29 తేదీల్లో గృహ ప్రవేశాలకు అనువైన ముహూర్తాలున్నాయి. కొత్తగా ఇళ్లు కట్టుకున్న వారంతా ఆయా శుభ సమయాల్లో గృహప్రవేశాలు చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

**మండపాలకు గిరాకీ...** వేసవిని తలపిస్తూ మండుతున్న ఎండలు, ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శుభకార్యాలున్న కుటుంబాల్లో ఎక్కువ మంది కల్యాణ మండపాలకే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల అన్నిచోట్ల గిరాకీ నెలకొంది.

నవంబరు, డిసెంబరు మాసాల్లో కూడా తుపాన్ల బెడద ఉంటుందని భావించి ఆ సమయంలో కూడా కల్యాణ మండపాల్లోనే శుభకార్యాలు చేసుకోవడానికి ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 500 వరకు కల్యాణ మండపాలు అందుబాటులో ఉండగా ద్వారకాతిరుమల, భీమవరం, పాలకొల్లు పంచారామ క్షేత్రంలోను వివాహాలు చేసుకోవడానికి పేద, మధ్య తరగతి కుటుంబాలు కొందరు సిద్ధమవుతున్నారు.

**చేతినిండా పని** రెండు నెలల పది రోజులుగా నెమ్మదించిన ఉపాధి ప్రస్తుత ముహూర్తాలతో మళ్లీ ఊపందుకోనుంది.

అలంకరణలు చేసేవారి నుంచి వాహనాలు అద్దెకు తిప్పే ట్రావెల్స్ వరకు పురోహితులు, ఫొటోగ్రాఫర్లు, వంట నిర్వాహకులు, పూల వ్యాపారులు, వస్త్ర, బంగారం దుకాణాలు, బ్యూటీషియన్లు, ఆర్కెస్ట్రా నిర్వాహకులు, బ్యాండ్, సన్నాయిమేళం కళాకారుల వరకు ప్రతిఒక్కరికీ చేతినిండా పని లభించనుందని భీమవరానికి చెందిన టెంట్‌హౌస్ నిర్వాహకుడు శ్రీను తెలిపారు.

# సర్పంచులతో చంద్రబాబు సమావేశం.. ఆవేదనను బయటపెట్టిన పలువురు సర్పంచులు



అంబేద్కర్ కోనసీమ: జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి పర్యటన కొనసాగుతోంది. గురువారం ఉదయం మండపేటలో పర్యటించిన టీడీపీ చీఫ్.. సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 13 వేల మంది సర్పంచులు ప్రజలు కోసం పనిచేయాలన్నారు. సర్పంచులు హక్కులను జగన్ కాలరాస్తున్నారని మండిపడ్డారు. సర్పంచుల హక్కులను కాపాడుకునేందుకు పోరాటం చేయాలన్నారు. వ్యవస్థలను జగన్ నాశనం చేశారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక సర్పంచుల ఆధ్వర్యంలోనే పంచాయతీల పనులు చేయిస్తామని చెప్పారు. 25 వేల కిలోమీటర్లు రోడ్డు వేసిన ఏకైక ప్రభుత్వం టీడీపీ అని చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ సమావేశంలో పలు గ్రామాల సర్పంచులు తమ ఆవేదనను చంద్రబాబు ముందు ఉంచారు. వైసీపీ నేతలు, వలంటీర్ల వల్ల తాము పడుతున్న బాధలను టీడీపీ చీఫ్ దృష్టికి తీసుకొచ్చారు. రాజోలు, మలికిపురం మండలం కేశనపల్లి సర్పంచ్ తన ఆవేదనను బయటపెట్టారు. వాలంటీర్లు రాజ్యాంగేతర శక్తులుగా మారారన్నారు. సర్పంచులు చేస్తున్న ఉద్యమాన్ని జగన్ పట్టించుకోవటం లేదని కపిళేశ్వరపురం మండలం వల్లూరు మహిళా సర్పంచ్ ఆవేదన చెందారు. వాలంటీర్ల వ్యవస్థ ఉగ్రవాదంలా మారిందని.. హక్కుల కోసం మాట్లాడితే వాలంటీర్లు భయపడుతున్నారని రాజోలు నియోజకవర్గం విశ్వేశ్వరపురం సర్పంచ్ చెల్లుబోయిన వేణి తెలిపారు. సర్పంచులను వైసీపీ నేతలు భయపెడుతున్నారని మలికిపురం మండలం దిండి సర్పంచ్ వాపోయారు. సైకో ముఖ్యమంత్రి జగన్‌ను ఇంటికి పంపి పంచాయతీల హక్కులను కాపాడాలని మండపేట నియోజకవర్గం కపిళేశ్వరపురం సర్పంచ్ కోరారు.

# కృష్ణా జిల్లాలో లోకేశ్ పాదయాత్ర ఏర్పాట్లపై టీడీపీ నేతల సమావేశం



విజయవాడ: ఈనెల 19న ఉమ్మడి కృష్ణా జిల్లాలో టీడీపీ యువనేత నారా లోకేశ్ పాదయాత్ర చేయనున్నారు. ఈ సందర్భంగా పాదయాత్ర ఏర్పాట్లపై చర్చించేందుకు టీడీపీ నేత బుద్దా వెంకన్న కార్యాలయంలో ఆ పార్టీ నేతలు గురువారం సమావేశమయ్యారు. ఈనెల 19 నుంచి ఉమ్మడి కృష్ణాజిల్లాలో లోకేశ్ పాదయాత్ర, సభ నేపథ్యంలో ఏర్పాట్లపై నేతలు చర్చించారు. అనంతరం కేశినేని చిన్ని మాట్లాడుతూ.. నారా లోకేష్ యాత్ర ఈనెల 19న ప్రకాశం బ్యారేజీ మీదుగా విజయవాడకు చేరుకుంటుందన్నారు. మూడు రోజుల పాటు యాత్ర ఈ జిల్లాలో ఉంటుందని తెలిపారు. వేలాది మందితో గన్నవరంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని... ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలు కష్టాలు పడకూడదని ఆలోచన చేస్తున్నామని తెలిపారు. నారా లోకేశ్ పాదయాత్రకు ఘనంగా స్వాగతం పలుకుతామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయన యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని.. లోకేశ్ సభకు వేలాదిగా తరలివచ్చే కార్యకర్తల కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. యాభై వేల మందితో లోకేశ్ పాదయాత్ర ఈ జిల్లాలో కొనసాగుతోందని కేశినేని చిన్ని వెల్లడించారు.

బుద్దా వెంకన్న మాట్లాడుతూ.. నారా లోకేశ్‌కు వస్తున్న ప్రజాదరణతో వైసీపీ నేతల్లో వణుకు మొదలైందన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రజలు లోకేశ్‌కు అపూర్వ స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టీడీపీ నాయకుల మధ్య ఎటువంటి వర్గ విభేదాలు లేవని స్పష్టం చేశారు. గ్రూపులు ఎవరూ లేరని.. లోకేశ్ యాత్రలో నాయకులంతా కలిసి స్వాగతం పలుకుతారన్నారు. గన్నవరం సభను కూడా విజయవంతం చేసి చూపిస్తామన్నారు. అందరం సమిష్టిగా కలిసి టీడీపీ కోసం పని చేస్తామన్నారు. విజయవాడలో మూడు సీట్లు టీడీపీ కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సజ్జల వ్యాఖ్యలు, జగన్ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. టీడీపీకి గన్నవరం కంచుకోట అని.. వంశీ కూడా టీడీపీ నుంచి గెలిచే.. వైసీపీలోకి వెళ్లారని గుర్తుచేశారు. యార్లగడ్డ వెంకట్రావును వైసీపీ పెద్దలే మోసం చేశారన్నారు. తల్లిని, చెల్లినే వదిలేసిన వాళ్లకి.. యార్లగడ్డ ఒక లెక్క కాదన్నారు. టీడీపీ కార్యకర్తల బలంతో నడిచే పార్టీ అని.. 2024 ఎన్నికలలో టీడీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. చంద్రబాబు పాలన, నాయకత్వంపై ప్రజలంతా ఎంతో నమ్మకంతో ఉన్నారని బుద్దా వెంకన్న పేర్కొన్నారు.

# మంత్రి రజిని అవినీతి చిట్టాకు లెక్కే లేదు




పల్నాడు జిల్లా: తెలుగుదేశంపార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినిపై విమర్శలు చేశారు. ధనార్జనే ధ్యేయంగా మంత్రి పనిచేస్తున్నారని ఆరోపించారు. గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ రజిని అవినీతి చిట్టాకు లెక్కే లేదని.. ఇంకా ఎంత దోచుకుంటారో తెలియదని అన్నారు. మంత్రి విడదల రజిని ఆరోగ్యశాఖను పూర్తిగా భ్రష్టుపట్టించారని విమర్శించారు. ఆస్పత్రుల్లో కనీసం మందులు కూడా అందుబాటులో ఉండట్లేదన్నారు. మంత్రి అవినీతిపై రాష్ట్రం మొత్తం కోడై కూస్తోందన్నారు. వైద్యారోగ్య శాఖలో పోస్టుల భర్తీ నుంచి బదిలీల వరకు అవినీతే జరుగుతోందని, భూవివాదం ఉన్నచోట తలదూర్చి సెటిల్ మెంట్లు చేస్తున్నారని ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. కుటుంబీకులను ముందు పెట్టి అవినీతి వ్యవహారాలను చక్కబెడుతున్నారని, చిలకలూరిపేట మున్సిపాలిటీని అవినీతికి అడ్డాగా మార్చారన్నారు. పనులు చేయకుండానే రూ.2.70 కోట్ల బిల్లులు చేసుకున్నారని, ప్రజాధనాన్ని మంత్రి రజని సొంతానికి వాడుకుంటున్నారని విమర్శించారు. మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది మొత్తం మంత్రి కుటుంబీకులేనని, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో రూ.50 లక్షల అవినీతి జరిగిందని ప్రత్తిపాటి పుల్లారావు తీవ్రస్థాయిలో ఆరోపించారు.

# వంద కోట్లు ఇస్తే రాజీనామా చేస్తా : జేసీ ప్రభాకర్‌రెడ్డి

అనంతపురం: తాడిపత్రి బాగుకోసం వంద కోట్లు మంజూరు చేస్తే తాను చైర్మన్‌గా రాజీనామా చేస్తానని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సవాల్ విసిరారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. తాడిపత్రి మున్సిపాలిటీని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దోచుకుంటున్నాడంటూ మండిపడ్డారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి అక్రమాలపై ఫ్లెక్సీ ఏర్పాటు చేసి మరీ జేసీ మీడియాకు వివరిస్తున్నారు. పోలీస్ స్టేషన్ కోసం మున్సిపాలిటీ స్థలాన్ని తీసుకుంటున్నారని.. అక్కడ నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా వైసీపీ ఆడించినట్లు ఎస్పీ ఆడుతున్నారని ఆరోపించారు. తన మీద కక్ష పెట్టుకోవద్దన్నారు. మార్కెట్లో దుకాణాలను ఎమ్మెల్యే మనుషులకు ఇచ్చారన్నారు. టీడీపీ కౌన్సిలర్ రాబర్ట్‌ను వైసీపీలో చేర్చుకుని మున్సిపల్ స్థలాన్ని కట్టబెట్టి బిర్యానీ సెంటర్ పెట్టిస్తున్నారని తెలిపారు. కలెక్టర్, ఎస్పీకి చెప్పినా ఒక్క అధికారి కూడా పట్టించుకోరని అన్నారు. తాడిపత్రి మున్సిపాలిటీనా బందలదొడ్డినా అంటూ జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**రేయ్ ఆఫీసర్లు అంటూ...** జేసీ ఇంకా మాట్లాడుతూ... అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "రేయ్ ఆఫీసర్లు తమాషా చేస్తున్నారా... మీరు ఏమైపోతారో. ఇసుక తరలించొద్దు అంటూ గ్రీన్ ట్రిబ్యునల్, కోర్టు తీర్పులిచ్చిన ఇసుక తరలిస్తారా. లా అండ్ ఆర్డర్ లేదా... ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చినా రిప్లై ఇవ్వరా. తాడిపత్రి నా ఇల్లు... తాడిపత్రి కోసం ప్రాణమిస్తా రేయ్ ఆర్జేడీ నీకు పోస్టింగ్ ఎందుకు. సెక్షన్స్ ఉన్నాయి.. నిన్ను విడిచిపెట్టేది లేదు. ఎస్పీ గారు నా మాటలు మిమ్మల్ని బాధపెట్టొచ్చు... ఎవరికీ భయపడి ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయడం లేదు. తాడిపత్రి ఇసుక తరలింపును ఆపాల్సిందే. రేయ్ డీటీసీ మీకు ఉద్యోగాలు ఎందుకు... అమ్మిన వాడిపైన కాకుండా మా పైన కేసులు పెడుతారు. మేము కార్యకర్తల కోసం.. కార్యకర్తల కవచం నారా లోకేష్ కార్యక్రమం చేపడుతున్నాం. పార్లమెంట్ ఇన్‌చార్జ్ పవన్ రెడ్డి ఈ కార్యక్రమం లీడ్ చేస్తారు... చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం కోసం ఎవరి కాళ్ళు అయినా పట్టుకుంటాంప. అందరికన్నా నష్టపోయింది మేమే.. ఎమ్మెల్యేలు ఎవరైనా పర్లేదు చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే చాలు" అంటూ జేసీ వ్యాఖ్యలు చేశారు.

# బ్లాక్ డ్రెస్ లో డార్క్ ఏంజిల్ గా మృణాల్ ఠాకూర్

సీతారామం సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన అందాల భామ మృణాల్ ఠాకూర్. ఈ అమ్మడు మొదటి సినిమాతోనే నటిగా తన పెర్ఫార్మెన్స్ తో ప్రశంసలు సొంతం చేసుకుంది. కెరియర్ లో మరిచిపోలేని సక్సెస్ ను సొంతం చేసుకుంది. సీతారామం సినిమా ఈ దశాబ్దంలో వచ్చిన క్లాసిక్ మూవీ అనే గుర్తింపుని సొంతం చేసుకోవడంతో మృణాల్ కి అన్ని పాన్ ఇండియా ఇమేజ్ ని అందించింది. ఇదిలా ఉంటే ఈ మూవీ తర్వాత నేచురల్ స్టార్ నానికి జోడీగా మృణాల్ నటించబోతోంది. ఈ మూవీ షూటింగ్ స్టార్ట్ అయ్యింది. సినిమాలలో కాస్తా పద్ధతైన పాత్రలలో నటించే హీరోయిన్స్ అందరూ బయట అంతే పద్ధతి ఉంటారని మాత్రం అనుకోకూడదు.



మృణాల్ ఠాకూర్ కూడా అంతే. ఈ బ్యూటీ బయట అల్ట్రా మోడ్రన్ గానే ఎక్కువగా కనిపించడానికి ఇష్టపడుతుంది. ట్రెడిషనల్ కాస్ట్యూమ్స్ లో కంటే వెస్ట్రన్ వేర్స్ లోనే ఎక్కువగా కనిపించడానికి ఆసక్తి చూపిస్తుంది. అలాగే సిల్వర్ స్క్రీన్ పై కమర్షియల్ హీరోయిన్ గా సక్సెస్ కావాలంటే అందాల ప్రదర్శన చేయాల్సిందే అనే విషయాన్ని ఈ అమ్మడు బలంగా నమ్ముతుంది. అందుకే రెగ్యులర్ గాహాట్ హాట్ ఫోటో షూట్ లతో ఇంస్టాగ్రామ్ లో సెగలు రేపుతూ ఉంటుంది. మిగిలిన బాలీవుడ్ భామల తరహాలోనే మృణాల్ ఠాకూర్ కూడా ఎక్కువగా ఫోటో షూట్ లు చేస్తూ తనని తాను షోకేస్ చేసుకుంటూ ఉంటారు. ఈ మధ్య గ్లామర్ డోస్ మరింత పెంచి అందాల ప్రదర్శనని మృణాల్ ఠాకూర్ చేస్తూ ఉన్నారు. తాజాగా ఈ అమ్మడు బ్లాక్ కలర్ డ్రెస్ లో కెమెరా లైటింగ్ లో కలర్ ఫుల్ గా మెరిసిపోతోంది. బ్యాక్ నుంచి ఎద అందాలు చూపిస్తూ రెచ్చగొడుతుంది. ఈ ఫోటోలు ఇప్పుడు వైరల్ గా మారాయి. మృణాల్ ఠాకూర్ షేర్ చేసిన ఈ ఫోటోలని 4 నిమిషాల్లో ఏకంగా 1.43 లక్షల మంది లైక్ చేయడం విశేషం. ఈ ఫోటోలలో మృణాల్ బ్లాక్ ఏంజిల్ లా మెరిసిపోతుంది అనేమాట నెటిజన్లు నుంచి వినిపిస్తోంది.

# బాత్ రూంలో స్నాక్స్ తినేదాన్ని..!

బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా మెప్పించిన ప్రియాంక చోప్రా ఆ తర్వాత హాలీవుడ్ సినిమాలు మరియు సిరీస్ ల్లో నటించి పాపులారిటీని సొంతం చేసుకుని గ్లోబల్ స్టార్ గా మారిన విషయం తెల్సిందే. హీరోయిన్ గా ప్రియాంక చోప్రా కు ప్రస్తుతం పాన్ వరల్డ్ గుర్తింపు ఉంది. హాలీవుడ్ సిరీస్ ల ద్వారా స్టార్ ఇమేజ్ దక్కించుకున్న ప్రియాంక చోప్రా పూర్తిగా అమెరికాలోనే సెటిల్ అయ్యింది. అమెరికన్ సింగర్ నిక్ జోనస్ ను వివాహం చేసుకున్న ప్రియాంక చోప్రా అక్కడే ఉంటుంది. ప్రస్తుతం అక్కడ నివాసం ఉంటున్న ప్రియాంక చోప్రా



ఒకప్పుడు చదువుకు నేందుకు వెళ్లిన సమయంలో అక్కడ చాలా కష్టాలు ఎదుర్కొన్నట్లు ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ప్రియాంక చోప్రా నటించిన ఒక వెబ్ సిరీస్ ప్రమోషన్ లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో.. హై స్కూల్ విద్య కోసం అమెరికా వెళ్లాను. వెళ్లిన కొత్తలో తాను చాలా ఇబ్బందులు పడ్డాను. ముఖ్యంగా అక్కడి వారితో ఎలా మెలగాలో తెలియక ఒంటరితనం ఎదుర్కొన్నాను. అక్కడ ఎవరు పరిచయం అవ్వక పోవడంతో రకరకాలుగా భయాలు ఉండేవి. క్యాంటీన్ కు వెళ్లి ఫుడ్ ఎలా తీసుకోవాలో తెలిసేది కాదు. దాంతో వెండింగ్ మిషన్ లో స్నాక్స్ ను తీసుకుని వాటిని బాత్ రూం లో కూర్చుని తినేసి ఆ తర్వాత క్లాస్ కు వెళ్లే దాన్ని.

చాలా రోజుల పాటు నాకు వేరే వారితో పరిచయం అవ్వక పోవడంతో ఒంటరిగానే ఉండేదాన్ని. నాలుగు వారాల తర్వాత ప్రతి విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించి ఆ తర్వాత స్కూల్ లో పరిచయం చేసుకోవడం మొదలు పెట్టాను. కొందరు స్నేహితులు లేట్ నైట్ పార్టీలని.. పబ్ లంటూ వెళ్లే వారు. వారితో పాటు నన్ను పిలిచినా కూడా మా ఫ్యామిలీ లో అలాంటివి ఒప్పుకోరు అంటూ వాటిని తప్పించుకునేదాన్ని అంటూ ప్రియాంక చోప్రా పేర్కొంది. ఒకప్పుడు మొహమాటంతో ఇబ్బంది పడ్డ పీసీ ఇప్పుడు తన నటనతో పాన్ వరల్డ్ గుర్తింపు దక్కించుకున్న విషయం తెల్సిందే.




# వయసులో ఆ ఫీట్స్ ఏంటి మేడం?



హీరోయిన్ గా ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించిన జ్యోతిక తమిళ హీరో సూర్యను వివాహం చేసుకున్న తర్వాత ఇండస్ట్రీకి దూరం అయిన విషయం తెల్సిందే. పిల్లలు పెద్ద వారు అవ్వడంతో పాటు భర్త ప్రోత్సాహంతో జ్యోతిక మళ్లీ సినిమాల్లో రీ ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. చాలా గ్యాప్ తర్వాత రీ ఎంట్రీ ఇచ్చినా కూడా జ్యోతికకి మంచి కమ్ బ్యాక్ దక్కింది. ఆమె ఎక్కువగా లేడీ ఓరియంటెడ్ సినిమాలను చేస్తున్న విషయం తెల్సిందే. ఇంట్రెస్టింగ్ కథలను ఎంపిక చేసుకుని సినిమాలు చేస్తున్న జ్యోతిక వరుసగా సక్సెస్ లను దక్కించుకుంది. ఈ సమయంలోనే జ్యోతిక తన ఫిజిక్ పై చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జ్యోతిక వయసు ప్రస్తుతం ఇంటర్నెట్ అనుసారం 44 సంవత్సరాలు. సాధారణంగా ఈ వయసులో హీరోయిన్స్ గా ఆఫర్లు రావడం అనేది చాలా తక్కువ... సౌత్ లో ఈ వయసు వచ్చే వరకు హీరోయిన్ గా కంటిన్యూ అవ్వడం దాదాపు అసాధ్యం కానీ జ్యోతిక మాత్రం ఇంకా లేడీ ఓరియంటెడ్ సినిమాలతో హీరోయిన్ గా కంటిన్యూ అవుతున్న విషయం తెల్సిందే. తన సినిమాల కోసం జ్యోతిక చేస్తున్న వర్కౌట్స్ షాకింగ్ గా ఉన్నాయి. తాజాగా ఆమె షేర్ చేసిన ఒక వీడియో చూసి చాలా మంది షాక్ అవుతున్నారు. సింగిల్ హ్యాండ్ పై బ్యాలన్స్ చేయడం తో పాటు హీరోలకు సైతం సాధ్యం కాని కొన్ని ఫీట్స్ ను చేస్తూ అబ్బుర పర్చుతోంది. బాబోయ్ అంటూ చాలా మంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఉన్నారు. ఇంత కష్టం ఏ సినిమా కోసం అంటూ కొందరు కామెంట్స్ చేస్తూ ఉంటే.. మీరు ఈ స్థాయిలో వర్కౌట్స్ చేస్తే కొత్త హీరోయిన్స్ ఫిజిక్ విషయంలో సిగ్గుతో తల దించుకుంటారేమో అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి జ్యోతిక వర్కౌట్స్ వీడియో వైరల్ అవుతోంది.

# షూటింగ్ టైం పిక్.. శోభిత ఇలా షాక్ ఇచ్చిందేంటి..!



తెలుగు అమ్మాయే అయినా శోభిత ధూళిపాల బాలీవుడ్ సినిమాలు చేస్తూ అక్కడ కల్చర్ ని అలవాటు చేసుకుంది. సినిమాలే కాదు ఫోటో షూట్స్ లో కూడా బాలీవుడ్ భామలను మించి అనిపించేస్తుంది. అమ్మడు ఈమధ్య సౌత్ సినిమాల్లో కనిపిస్తుంది. అడివి శేష్ సినిమాలతో తెలుగు ఆడియన్స్ ని అలరిస్తున్న శోభిత మణిరత్నం తెరకెక్కించిన పొన్నియిన్ సెల్వన్ సినిమాలో కూడా అలరించింది. సినిమాలో వానాతి రోల్ లో నటించింది శోభిత. ఎప్పుడు వెస్ట్రన్ వేర్ తో అలరించే అమ్మడు ఈ సినిమాలో మాత్రం నిండుగా కనిపించింది. అఫ్కోర్స్ శోభితని అలా చూసిన ఆడియన్స్ ఈ కాస్ట్యూమ్స్ లో అమ్మడు అదిరిపోయిందని అంటున్నారు. సినిమా ఫలితం ఎలా ఉన్నా పిఎస్ 1 2 ఆ సినిమాలో నటించిన వారందరికి మంచి వర్కింగ్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చింది. ఇక పొన్నియిన్ సెల్వన్ రిలీజ్ తర్వాత ఆ సినిమా షూటింగ్ లాస్ట్ డే శోభిత చేసిన అల్లరిని లేటెస్ట్ గా తన ఇన్ స్టాగ్రామ్ లో పెట్టింది. తన కాస్ట్యూమ్ తో కనిపించిన అమ్మడు పక్కన ఐశ్వర్య లక్ష్మితో కలిసి స్టెప్పులు వేస్తుంది. మళ్లీ ఆ డ్రెస్ లో తమని తాము చూసుకోవడం కష్టమని భావించి ఫోటోలు వీడియోలు తీసేసుకున్నారు. అయితే రిలీజ్ ముందు పెడితే క్యారెక్టర్ తెలిసిపోతుందని అనుకున్నారో ఏమో కానీ పిఎస్ 2 తర్వాత ఈ ఫోటోలు షేర్ చేసింది. ప్రస్తుతం శోభిత షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. సినిమాల పరిస్థితి ఎలా ఉన్నా అమ్మడు టాలీవుడ్ హీరోతో డేటింగ్ లో ఉందన్న వార్తలు మాత్రం ఆమెను హైలెట్ చేస్తున్నాయి. అక్కినేని నాగ చైతన్యతో శోభిత రిలేషన్ పై రకరకాల వార్తలు వస్తున్నాయి. అయితే వీటిపై శోభిత మాత్రం పెదవి విప్పింది లేదు. పిఎస్ 2 ప్రమోషన్స్ టైం లో కూడా తన డేటింగ్ వార్తలపై ప్రశ్నలు రాకుండా జాగ్రత్త పడింది. ఏది ఏమైనా శోభిత సందడి ఈమధ్య తెలుగు ఆడియన్స్ ని అలరిస్తుందని చెప్పొచ్చు.

# బిగ్ బాస్ పిల్ల.. నిక్కరులో హీటెక్కించిందిగా..

బిగ్ బాస్ రియాల్టీ షో ద్వారా చాలామంది అందాల భామలు సెలబ్రెటీ ఇమేజ్ సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా తెలుగులో అయితే సోషల్ మీడియాలో పాపులర్ అయిన బ్యూటీస్ బిగ్ బాస్ లోకి అడుగుపెట్టి విపరీతమైన క్రేజ్ దక్కించుకున్నారు. అక్కడ నుంచి వచ్చిన తర్వాత అదే పాపులరిటీతో రియాలిటీ షోలలో పార్టిసిపేట్ చేస్తూ మరింత ఫేమ్ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక హీరోయిన్ గా సక్సెస్ కావాలని ప్రయత్నం చేస్తున్న అందాల భామలు తమలోని హాట్ నెస్ ని బయటకు తీసుకొస్తున్నారు. తెలుగు అమ్మాయిలు అయినా కూడా ఏ మాత్రం తగ్గకుండా గ్లామర్ డోస్ తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆషు రెడ్డి అరియానా గ్లోరీ తర్వాత ఆ స్థాయిలో ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ గా మారిన మరో బ్యూటీ శ్రీ సత్య. సీరియల్స్ లో నటిగా కెరియర్ ప్రారంభించిన



ఈ అమ్మడు తర్వాత గత ఏడాది బిగ్ బాస్ రియాల్టీ సోలో పార్టిసిపేట్ చేశారు. అక్కడ అందరి దృష్టిని ఆకర్షించి సెలబ్రిటీ ఇమేజ్ సొంతం చేసుకుంది. బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈ బ్యూటీకి మంచి అవకాశాలు వస్తున్నాయి అనే మాట వినిపిస్తోంది. తెలుగు టెలివిజన్ రియాలిటీ షో షోలలో కూడా పార్టిసిపేట్ చేస్తూ అందరి దృష్టిని ఆకస్తున్నారు. ఈ అమ్మడు గ్లామర్ డోస్ విషయంలో కూడా కాస్త స్పీడ్ పెంచింది అని చెప్పాలి. ఎక్కువగా షార్ట్స్ లో కనిపిస్తూ థైస్ అందాలు చూపిస్తే కుర్రాలను రెచ్చగొడుతుంది. శ్రీ సత్య థైస్ అందాలకు సోషల్ మీడియాలో విపరీతమైన ఫ్యాన్స్ కూడా ఉన్నారు. తాజగా ఈ బ్యూటీ ఇంస్టాగ్రామ్ లో మరోసారి హాట్ ఫోటోని షేర్ చేశారు. ఈ ఫోటో ఇప్పుడు వైరల్ గా మారింది. ఒక కుర్చీలో కూర్చుని మరో కుర్చీపై కాళ్ళు పైకి పెట్టి నిండైన ఆమె థైస్ అందాలు తనువితేరా చూపిస్తుంది. ఈ అందాలని చూస్తున్న కుర్రాళ్ళ గుండెలలో సెగలు రేగుతున్నాయి. ఈ స్థాయిలో రెచ్చగొడుతూ ఉంటే తట్టుకోవడం కష్టం అనే మాట వినిపిస్తోంది.

# ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్ తో రాశీఖన్నా శృంగారం!

థాంక్యూ తర్వాత రాశీఖన్నా కోలీవుడ్..బాలీవుడ్ చిత్రాలపైనే దృష్టి పెట్టింది. టాలీవుడ్ కెరీర్ ఆశించిన విధంగా లేకపోవడంతో! అమ్మడు ఇక ఇక్కడ లాభం లేదనుకుని ఇతర భాషల్నే టార్గెట్ చేసింది. ఆ రకంగా అవకాశాలు బాగానే అందికుంటుంది. ప్రస్తుతం తమిళ్..హిందీలో కలిపి నాలుగైదు సినిమాలు చేస్తుంది. ఇందులో యోధ మాత్రం అమ్మడికి మెమోరిబుల్ మూవీగా నిలిచిపోతుందనే వార్తలొస్తున్నాయి. ఈ సినిమా కోసం అమ్మడు అన్ని రకాలుగా సిద్దపడినట్లు తెలుస్తోంది. ఇందులో రాశీకి జోడీగా సిద్దార్థ్ మల్హోత్రా నటిస్తున్నాడు. రాశీతో పాటు దిశా పటానీ మరో హీరోయిన్ గా నటిస్తుంది. విమానం హైజాక్ నేపథ్యంలో తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇందులో సిద్దార్థ్ ఎయిర్ పోర్స్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నాడు. స్టోరీలో




భాగంగా సినిమాలో రొమాంటిక్ సన్నివేశాలు హద్దు మీరే ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సినిమాలో రాశీఖన్నా శృంగార సన్నివేశాల్లో ఏ మాత్రం తగ్గలేదు అన్న టాక్ బాలీవుడ్ మీడియాలో హల్చల్ చేస్తుంది. ఎగిరే విమానంలో సిద్దార్థ్ ఘాటైన సన్నివేశాల్లో నటించిందిట. హాలీవుడ్ సినిమా తరహాలో హీరో-హీరోయిన్ మధ్య ఇంటిమేట్ సన్నివేశాలు ఆసక్తి కట్టిస్తాయని వినిపిస్తుంది. బెడ్ రూమ్ సన్నివేశాల్ని మించి కొన్ని సన్నివేశాలు ఉన్నాయని అంటున్నారు. ఇలాంటి సన్నివేశాలు రాశీఖన్నాకి కొత్తేం కాదు. కెరీర్ ఆరంభంలో మడి కట్టుకుని కుర్చున్న ఆ తర్వాత రౌడీ స్టార్ విజయ్ దేవరకొండతో వరల్డ్ ఫేమస్ లవర్ లో ఏ రేంజ్ లో నటించిందో తెలిసిందే. అందులో బెడ్ రూమ్ సన్నివేశాల్లో రాశీ పెర్ఫార్మెన్స్ తో విజిల్స్ వేయించింది. స్టోరీ డిమాండ్ లో భాగంగా ఆ రకమైన సన్నివేశాలు వస్తున్నప్పుడల్లా థియేటర్ దద్దరిల్లింది. ఇక బాలీవుడ్ సినిమాలో రియాల్టీ కోసం మరింత అడ్వాంటేజ్ తీసుకుంటారు. ఈ నేపథ్యంలో యోధలో రాశీ రొమాంటిక్ సన్నివేశాలపై ఇప్పటి నుంచి ఆసక్తి మొదలైంది. ఇప్పటికే సిద్దార్థ్ మల్హోత్రాకి రొమాంటిక్ స్టార్ గా మంచి పేరుంది. రాశీఖన్నాతోనూ రొమాన్స వర్కౌట్ అయితే! ఆ ఇమేజ్ రెట్టింపు అవుతుంది.



# దీపంలాంటి కేసీఆర్ ఉండగా...

## పాపంలాంటి బీజేపీ.. శాపంలాంటి కాంగ్రెస్ ఎందుకు? : మంత్రి హరీశ్‌రావు

రంగారెడ్డి జిల్లా : బీజేపీ మోటార్లకు మీటర్లు పెట్టాలంటోందని, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతుందని అంటున్నారని మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం కేసీఆర్ మాత్రం మూడు పంటలు సాగు చేయాలంటున్నారని, ఎవరు కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హరీశ్‌రావు ప్రారంభోత్సవం, భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మంచి పనులు చేశారన్నారు. ఇబ్రహీంపట్నంపై తనకు ప్రత్యేక ప్రేమ ఉందని, అందుకే అభివృద్ధి చేశారన్నారు. తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలను తీసుకొచ్చి విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు.

**తల్లుల కోసం న్యూటిషన్ కిట్లు..** తల్లులు బలంగా ఉండాలని న్యూట్రిషన్ కిట్స్ తీసుకువచ్చాం. నాడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలు 30 శాతం అయితే.. నేడు 72.8 శాతం జరుగుతున్నాయి. బిడ్డ కడుపులో పడ్డప్పటి నుంచి న్యూట్రిషన్ కిట్స్, బిడ్డ పుడితే కేసీఆర్ కిట్స్ ఇస్తున్నామన్నారు. మహిళల సమగ్ర ఆరోగ్య సంరక్షణ కోసం సీఎం కేసీఆర్ ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రారంభించారన్నారు. రాష్ట్రంలో 200 క్లినిక్స్ ఏర్పాటు చేసి, ప్రతి మంగళవారం మహిళల కోసమే పరీక్షలు, మందులు, చికిత్స అందిస్తున్నారని చెప్పారు. తల్లికి పాలు, కోడిగుడ్డుతో భోజనం పెట్టే ఆరోగ్య లక్ష్మి, ఉచితంగా గర్భిణులను ఆసుపత్రికి తీసుకువెళ్లే అమ్మ ఒడి వాహనాలు ప్రారంభించినట్లు చెప్పారు. మహిళలకు తాగునీటి కష్టాలు లేకుండా చేశారన్నారు. నాడు నీళ్ల కోసం కొట్లాట, కనీళ్ల తండాట్లలేనన్నారు. అలాగే వడ్డీ లేని రుణాలు, అభయహస్తం, బ్యాంకు లింకేజీ పెంచినట్లు చెప్పారు. వీఏవోలను నాటి ప్రభుత్వాలు గుర్తించలేదన్నారు. రెన్యువల్ ఆటోమేటిక్ చేయాలని, ఇన్సూరెన్స్ చేయాలని, వేతనం పెంచాలనే కోరికలను వారంలో పరిష్కరిస్తామన్నారు. వీరితో పాటు ఆర్పీల సమస్యలను సీఎం కేసీఆర్ పరిష్కరించాలని ఆదేశించారని, వారంలో ఉత్తర్వులు ఇస్తామన్నారు.

**ఇంటి యజమానురాలి పేరిటే గృహలక్ష్మి..** ప్రతి పేదింటి ఆడబిడ్డ పెళ్లికి రూ.లక్ష సీఎం కేసీఆర్ ఇస్తున్నారని, ఆ చెక్కులను తల్లికి ఇవ్వాలని సీఎం ఆదేశించారని హరీశ్‌రావు తెలిపారు. గృహలక్ష్మి ద్వారా ఇచ్చే డబ్బులు ఇంటి యజమానురాలిపైనే ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఏ కార్యక్రమం చేసిన సీఎం మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. మహిళలకు రూపాయి ఇస్తే ఇంటికి సద్వినియోగం చేస్తారని సీఎంకు నమ్మకం ఉందన్నారు. గతంలో రూ.200 ఉన్న పింఛన్‌ను ప్రస్తుతం రూ.2వేలకు పెంచారని, కల్యాణలక్ష్మి పథకంలో రూ.75వేల నుంచి రూ.లక్షకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. రైతుల పంట రుణాలను మాఫీ చేస్తామని చెప్పి.. చేసి చూపించారన్నారు. కొందరు ఎన్నికల రాగానే అన్ని ఇస్తామంటున్నారని, ఓడ దాటే దాక ఓడ మల్లన్న.. ఓడ దాటాక బోడి మల్లన్న అన్నట్టు ప్రతిపక్షాలు చేస్తాయన్నారు.

**బెంగళూరులో నాలుగు గంటలే కరెంటు..** కాంగ్రెస్ కర్ణాటకలో గెలిచారని, అక్కడ రైతులకు 8 గంటల కరెంటు రావడం లేదని.. బెంగళూరులో నాలుగు గంటలే ఇస్తున్నారన్నారు. పరిశ్రమలకు కరెంటు కోత ఉందని, కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో కరెంట్ పరిస్థితి అలా ఉంటే.. ఇక్కడి కాంగ్రెస్ లీడర్ రేవంత్ రెడ్డి రైతులకు మూడు గంటల కరెంటు చాలు అంటున్నాడని, మూడు గంటలు ఇస్తే.. మూడు ఎకరాలు పారుతాయని రేవంత్‌రెడ్డి అంటున్నాడని, బీజేపీ వాళ్లు బావుల కాడ మీటర్లకు మోటార్లు పెట్టాలంటున్నారన్నారు. సీఎం కేసీఆర్ మాత్రం మూడు పంటలు సాగు చేయాలంటున్నారన్నారు. ఎవరు కావాలో ప్రజలే ఆలోచించుకోవాలని, రైతుల పాలిట నల్ల చట్టాలు తెచ్చి బీజేపీ పాపంగా మారితే.. మూడు గంటల కాంగ్రెస్ వాళ్లు శాపంగా మారన్నారు. దీపంలాంటి కేసీఆర్ ఉండగా.. పాపంలాంటి బీజేపీ.. శాపంలాంటి కాంగ్రెస్ ఎందుకు? అంటూ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు.





## పొంగులేటికి షాక్.. బీఆర్ఎస్‌లో చేరిన తెల్లం వెంకట్రావు..

ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి షాక్ తగిలింది. నిన్నటి వరకూ ఆయనకు అండగా ఉన్న తెల్లం వెంకట్రావు తిరిగి బీఆర్ఎస్‌లో చేరిపోయారు. ఆయనకు మంత్రి కేటీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను నమ్ముకుంటే కుక్క తోక పట్టుకొని గోదారి ఈదినట్లేనని వెంకట్ రావు కు త్వరగానే అర్థం అయిందన్నారు. అందుకే తిరిగి ఈ రోజు పార్టీలోకి వచ్చారన్నారు. వెంకట్రావు భవిష్యత్‌కు తమది బాధ్యత అని కేటీఆర్ అన్నారు. ఖమ్మం పక్కనే ఉన్న చత్తీస్‌గఢ్ పోడు భూములకు పట్టాలు ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఇక్కడ కాంగ్రెస్ నేతలు పెద్ద పెద్ద డైలాగ్స్ కొడుతున్నారన్నారు. ఎకరానికి పది క్వింటాళ్లు మాత్రమే చత్తీస్‌గఢ్‌లో కొంటున్నారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ను ఎందుకు ఆదరించాలని ప్రశ్నించారు. రూ.4 వేలు పెన్షన్ ఇస్తామని కాంగ్రెస్ నేతలు బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో ఎందుకు నాలుగు వేలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రేపు 25గంటల కరెంట్ ఇస్తామని అన్నా అంటారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మూడు గంటల కరెంట్ చాలు అంటున్నారన్నారు. ఇంకా కేటీఆర్ మాట్లాడుతూ.. "ఇలాంటి వారు మనకు అవసరమా? ఎవరికి ఏం అన్యాయం చేశారని కేసీఆర్‌కు ఓటు వేయరు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చే పథకాలు రాని ఇల్లు లేదు. కాంగ్రెస్ వాళ్లకు కూడా రైతు బంధు వస్తుంది.. తీసుకుంటున్నరు తిడుతున్నారు. భద్రాద్రి ఆలయాన్ని పునర్నిర్మాణం చేస్తాం. భద్రాచలానికి శాశ్వత వరద నివారణకు కరకట్టల నిర్మాణం చేస్తాం. ఎవరెన్ని వాగినా మళ్లీ వచ్చేది బీఆర్ఎస్. కమ్యూనిస్టులు, నక్సలైట్లు కోరుకునే సమ సమాజ స్థాపన బీఆర్ఎస్ చేస్తోంది. కర్నూల్, రాయచూర్ నుంచి కూలి పని కోసం తెలంగాణకు వస్తున్నారు. గతంలో పదిసార్లు అవకాశం ఇస్తే ఏం చేయని కాంగ్రెస్ ఇప్పుడు ఒక్క అవకాశం ఇవ్వమని అడుగుతోంది. కొందరు వచ్చి డబ్బులు ఇస్తాం అంటారు... కానీ ఓటు మాత్రం కేసీఆర్‌కే వేయండి. కేంద్రంలో మనం లేకుండా ఎవరూ ప్రధాని కాలేరు. ఇక్కడి తీర్పు మహారాష్ట్రలో మలుపు కావాలి" అని పేర్కొన్నారు.

## బీబీనగర్ - గుంటూరు డబ్లింగ్ రైల్వే ప్రాజెక్టుకు మోక్షం







నల్లగొండ: బీబీనగర్ - (నడికుడి) గుంటూరు జిల్లాల మధ్య రైల్వే డబ్లింగ్ లైన్ల కోసం ఎట్టకేలకు మోక్షం లభించింది. కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ డబ్లింగ్ పనుల కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. మొత్తం 239 కిలోమీటర్లకు రూ. 2,853.23 కోట్ల అంచనా వ్యయంతో ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ డబ్లింగ్ లైన్ పూర్తయితే మెరుగైన ప్రయాణంతో పాటు రైళ్ల వేగం పెరగడం రవాణా సౌలభ్యం సులువు కానుంది. ఈ ప్రతిపాదిత ప్రాజెక్టు ద్వారా ప్రస్తుత లైన్ సామర్థ్యం పెరుగుతుంది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ కమిటీ దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. బీబీనగర్ - గుంటూరు డబ్లింగ్ లైన్ ప్రాజెక్టుకు ఆమోదం తెలపడంతో ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ ప్రాజెక్టులను పూర్తి చేయడం వల్ల ఇటు తెలంగాణ అటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుతుంది. కొత్త రైళ్లను ప్రవేశపెట్టడంతో పాటు అదనపు సరుకు రవాణానున సులభతరం చేస్తారు. ఇటీవలే నల్లగొండ జిల్లా తిప్పర్తి నుంచి కర్ణాటక రాష్ట్రానికి రవాణా సౌకర్యం కోసం ప్రత్యేక రైలును ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ డబ్లింగ్ పూర్తయితే సమయపాలనతో పాటు వ్యాగన్ టర్న్ రౌండ్ సమయాన్ని మెరుగుపరుస్తుంది. దీని ద్వారా రైళ్ల రద్దీని తగ్గించడానికి, రైళ్ల సంఖ్యను పెంచడానికి కూడా దోహదపడుతుందని చెప్పవచ్చు. 239 కిలోమీటర్ల రైలు మార్గాన్ని డబ్లింగ్ చేయడం వల్ల సుమారు 75 లక్షల మ్యాన్‌డేస వరకు ప్రత్యక్ష ఉపాధిని కూడా కల్పిస్తుంది. బీబీనగర్ నుంచి గుంటూరు జిల్లాల వరకు డబ్లింగ్ లైన్ నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల మీదుగా వెళ్తుంది. ఈ రెండు జిల్లాల వైశాల్యం 23,180.38 చదరపు కిలోమీటర్లు కాగా ఈ జిల్లాలో 1070 గ్రామాలు ఈ రైల్వేలైన్ ప్రాజెక్టు సమీపంలో ఉన్నాయి. రైల్వే డబ్లింగ్ పనుల సమీపంలో బీబీనగర్, నల్లగొండ, నకిరేకల్, నార్కట్‌పల్లి, భువనగిరి, చిట్యాల, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, దాచేపల్లి, పిడుగురాళ్ల, సత్తనపల్లి, గుంటూరు, విజయవాడ వంటి ప్రాంతాలు ఈ రెండు తెలుగురాష్ట్రాల్లో ఉండటంతో ఈ రైల్వేలైన్ వల్ల ఎంతగానో ప్రయోజనం ఉంటుంది.

సికింద్రాబాద్ నుంచి గుంటూరు, విజయవాడ స్టేషన్ల మధ్య రైళ్ల ప్రయాణ సమయం కూడా తగ్గిస్తుంది. బీబీనగర్, గుంటూరు సెక్షన్ల డబ్లింగ్ వల్ల సెక్షన్ల సామర్థ్యం పెరగడంతో పాటు మరిన్ని గూడ్స్, ప్యాసింజర్ రైళ్లను ప్రవేశపెట్టేందుకు వీలుంటుంది.

## సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్



హైదరాబాద్ : రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ డీ రాజేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

రాజేశ్వరరావును ప్రభుత్వం ఇటీవల క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే.

ఈ క్రమంలో ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌కు కలిసి ధన్యవాదాలు తెలిపి.. శాలువాతో సత్కరించారు. క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## నిరుపేద భూములను లాక్కోడానికే మున్సిపల్ మాస్టార్ ప్లాన్

నిర్మల్: నిర్మల్‌లో మున్సిపల్ మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. మహేశ్వర్‌రెడ్డి దీక్షకు బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. రైతుల పక్షాన పోరాటం చేస్తున్న మహేశ్వర్ రెడ్డికి పార్టీ పూర్తి అండగా ఉంటుందని అన్నారు. అభివృద్ధి పేరిట సీఎం కేసీఆర్ అన్ని రకాల దోపిడీకి తెరలేపారన్నారు. నిరుపేద భూములను లాక్కోవడానికే మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారని మండిపడ్డారు. అగ్రిజోన్‌ను ఇండస్ట్రియల్ జోన్‌గా మార్చే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. నిర్మల్ కొత్త మాస్టర్ ముసాయిదా బీఆర్ఎస్ నాయకుల లబ్ధి కొరకే అని ఆరోపించారు. తక్షణమే రద్దు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కేసీఆర్ మాటగారి, చెప్పేవన్నీ అబద్ధాలు, అభివృద్ధి



శూన్యమంటూ వ్యాఖ్యలు చేశారు. నైజాం చక్రవర్తిల వ్యవహరిస్తున్నారన్నారు. ప్రతిపక్ష నేతలను అరెస్టు చేస్తూ ధర్నాలు, రాస్తారోకాలు చేయకుండా పోలీసులతో అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేశ్వర్‌రెడ్డి దీక్షకు మద్దత్తుగా భారీగా బీజేపీ శ్రేణులు తరలివచ్చారు.

## కాళేశ్వరం అవినీతిపై తాడోపేడో తేల్చుకోవాలి: నాగం జనార్ధన్‌రెడ్డి



హైదరాబాద్: అసెంబ్లీలో పెట్టాల్సిన కాగ్ రిపోర్టును ముఖ్యమంత్రి కేసీఆర్ పక్కన పెట్టారని కాంగ్రెస్ సీనియర్ నేత నాగం జనార్ధన్‌రెడ్డి విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు దేశంలోనే అత్యంత భారీ కుంభకోణం జరిగిన ప్రాజెక్టు అని ఆరోపించారు. కాళేశ్వరం పేరుతో కొన్ని వేల కోట్ల లూటీ జరిగిందన్నారు. ఆ లూటీని ఆపే బాధ్యత ముఖ్యమంత్రికి లేదా? అని ప్రశ్నించారు. 40శాతం అవినీతి జరిగిందని కర్ణాటకలో భాజపాను గద్దె దించారు. తెలంగాణలో 70-75 శాతం అవినీతి జరుగుతోంది. తాడోపేడో తేల్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీలకు విజ్ఞప్తి చేస్తున్నా. అవినీతి సంగతి తేల్చకుండా ఎన్నికలకు వెళ్లడం కరెక్టు కాదు. ప్రాజెక్టులు, బస్సులు అన్నీ మేఘా కృష్ణారెడ్డికే అప్పగించారు. మేఘా కృష్ణారెడ్డి తెలంగాణకు క్యాన్సర్ కంటే ప్రమాదకారిగా మారారు. అన్ని రాజకీయ పార్టీలకు ఫండింగ్ ఇచ్చి మేనేజ్ చేసే స్థాయికి వచ్చారు" అని నాగం జనార్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు.

## మోదీ, కేసీఆర్, రాహుల్‌ను ఢీ కొట్టే శక్తి నాకే ఉంది



సంగారెడ్డి: బీఆర్ఎస్, బీజేపీ మధ్య అవగాహన ఒప్పందం ఉందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. సంగారెడ్డిలో ఆయన మీడియాతో మాట్లాడారు. "తొమ్మిదేళ్లలో ఏనాడూ జగ్గారెడ్డిని నేను శపించలేదు. జగ్గారెడ్డిని ప్రజాశాంతి పార్టీలో చేరాలని ఆహ్వానిస్తున్నా. సదాశివపేటలో 1200 ఎకరాల్లో చారిటీ సిటీ కట్టా. చారిటీ సిటీని చూసి దేశ, విదేశీ ప్రతినిధులు చూసి ఆశ్చర్యపోయారు. ఆనాటి సీఎం రాజశేఖర్ రెడ్డికి డబ్బులు ఇవ్వనందుకు ఎమ్మెల్యే జగ్గారెడ్డితో గొడవ చేయించి నా చారిటీ మూయించారు. జగ్గారెడ్డిని ఇప్పటి వరకు క్షమించాను.. ఇక నుంచీ క్షమించను. వెయ్యి కోట్లు ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీలో చేరుతావా? అభివృద్ధి చేసే నా పార్టీలో చేరతావా?, కేసీఆర్... గద్దర్ బతికి ఉన్నప్పుడు ఏనాడూ పట్టించుకోలేదు. గద్దర్ చచ్చిపోతే అన్ని పార్టీల నాయకులు కుక్కల్లాగా వాలిపోయారు. మంత్రి మల్లారెడ్డి భూములు కబ్జా చేస్తున్నారు. కేటీఆర్ గూగుల్‌ని కనిపెట్టినట్లు బిల్డప్ ఇస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులు ఉన్నా రేవంత్‌కి పీసీసీ పదవి ఇచ్చారు. రేవంత్‌కి అసలు ఓటు బ్యాంకే లేదు. ఆర్ఎస్ఎస్ వల్లే రేవంత్‌ని టీ పీసీసీ చీఫ్‌ని చేశారు. మోదీ, కేసీఆర్, రాహుల్‌ని ఢీ కొట్టే శక్తి కేఏ పాల్‌కే ఉంది. కేసీఆర్ మంత్రి వర్గంలో ఉన్న చాలా మంది మంత్రులు నాతో టచ్‌లో ఉన్నారు. నేను గెలిస్తేనే తెలంగాణ బాగుపడుతుందని మంత్రులు చెప్పారు." అని కేఏ పాల్ వ్యాఖ్యానించారు.

## ఆర్థిక సాయానికి జర్నలిస్టుల కుటుంబాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

సంక్షేమ నిధి ద్వారా ఆర్థిక సహాయం కోసం మరణించిన జర్నలిస్టుల కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ సూచించారు. దరఖాస్తులు నిర్ణీత నమూనాలో పూర్తి చేసి, సంబంధిత డీపీఆర్‌వో ద్వారా ధ్రువీకరించాలని, దరఖాస్తుతో పాటు డెత్ సర్టిఫికెట్, ఆదాయ, కుటుంబ ధ్రువీకరణ పత్రం, జర్నలిస్టు గుర్తింపు కార్డును జతచేయాలన్నారు. ప్రమాదం బారినపడి, అనారోగ్య కారణాలతో పని చేయలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులు సైతం సహాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో ప్రభుత్వ సివిల్ సర్జన్ ఇచ్చిన 'జర్నలిస్టు పని చేసే స్థితిలో లేదు' సర్టిఫికేట్, ఆదాయం, జర్నలిస్టు గుర్తింపు కార్డు వివరాలతో దరఖాస్తును డీపీఆర్ ద్వారా ధ్రువీకరించాలన్నారు. గతంలో దరఖాస్తు చేసిన వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇప్పటికే మీడియా అకాడమీ నుంచి లబ్ధి పొందిన, పెన్షన్ పొందుతున్న వారు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులని చెప్పారు. దరఖాస్తులను ఈ నెల 21లోగా కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ, ఇంటి.నం.10-2-1, ఎఫ్‌డీసీ కాంప్లెక్స్, 2వ అంతస్థు, సమాచార భవన్, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్ - 500028 చిరునామాకు పంపాలన్నారు. కమిటీ దరఖాస్తులను పరిశీలించి.. ఆర్థిక సాయాన్ని అందజేస్తుందని తెలిపారు. ఇతర వివరాల కోసం 7702526489 నంబరులో కార్యాలయ అధికారిని సంప్రదించాలని సూచించారు.

## కోమటిరెడ్డి సన్యాసం తీసుకో.. ఇదే సరైన సమయం.. గుత్తా సెటైర్



నల్గొండ: "పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా నా సహకారం ఉంటుంది.. మాకు కావాల్సింది కేసీఆర్ ప్రభుత్వమే" అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో గుత్తా మాట్లాడుతూ.. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమయం, సందర్భం లేకుండా తనపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. టెండర్ల ద్వారానే గంధమల్ల రిజర్వాయర్ పనులు వచ్చాయని, భూసేకరణ వల్ల పనుల్లో ఆలస్యం ఏర్పడిందన్నారు. నిజాంకాలం నాటి నుండే ఉన్న కాంట్రాక్టర్లను గుత్తా సుఖేందర్ రెడ్డికి అపాదించడం సరికాదన్నారు. ఏ పదవీ వద్దంటున్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సన్యాసం తీసుకుంటే మంచిది, ఇదే సరైన సమయం అంటూ ఎద్దేవా చేశారు. రెండు లక్షల రుణమాఫీ అసాధ్యంమైందే ప్రజలు అలోచించాలన్నారు. ప్రజలను మోసం చేసేలా జాతీయ పార్టీలు వ్యవహరించొద్దని హితవుపలికారు. కాంగ్రెస్ పార్టీలో టీపీసీసీ అధ్యక్షుడు ఒకటంటే మరొకరు ఒకటంటారని... వీరు అధికారంలోకి ఎలా వస్తారని గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రశ్నించారు.

## రవీంద్రభారతిలో ప్రపంచ ఫొటోగ్రఫి డే.. ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎంపీ సంతోష్ కుమార్



హైదరాబాద్: ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవంలో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ ప్రారంభించారు. మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణతో కలిసి ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం ఎంపీ సంతోష్ మాట్లాడుతూ.. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవానికి రావడం సంతోషంగా ఉందన్నారు. తనకు ఫొటోగ్రఫీ ఒక హాబీ అని, మనం ఎమోషనల్‌గా ఉంటే తప్ప ఒక అద్భుతమైన ఫొటో రాదని చెప్పారు. ఫొటోగ్రాఫర్‌ల కోసం తన వంతు కృషిగా రూ.2 లక్షలు సాయంచేస్తానని ప్రకటించారు. ఫొటో జర్నలిస్టులకు భవిష్యత్‌లో అండగా ఉంటామని వెల్లడించారు.

ప్రతి సంవత్సరం ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. అందరి ప్రోత్సాహంతో ఫొటో ఎగ్జిబిషన్ కొనసాగుతున్నదని వెల్లడించారు. అందరూ ఫొటోగ్రాఫర్లకు అండగా నిలవాలని చెప్పారు. కాగా, ఈ ఎగ్జిబిషన్‌లో ఎంపీ సంతోష్ తీసిన ఫొటోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. న్యూస్ పిక్చర్స్, తెలంగాణ పండుగలు, అభివృద్ధి విభాగాల్లో ఫొటోలను ఇందులో ప్రదర్శించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com